Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక : 320 పేజీలు 8 వెల : 5 ఆదివారం 20 ఏప్రిల్ 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్: చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక
ప్రకటనదారులకు విజ్ఞప్తి...

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| మల్టీకలర్ | బ్లాక్ & వైట్ పేజి |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



2లో..

## గాజాపై బాంబుదాడి

70మంది పాలస్తీనియన్ల మృతి



2లో..

## గుజరాత్‌లో బిజెపిని ఓడించి తీరుతాం

కొత్త నాయకత్వాన్ని తీసుకుని వస్తాం

మా వ్యూహాలు మాకున్నాయి: రాహుల్




చెత్త చెదారంతో అపవిత్రం చేయవద్దు

ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని పాటించాలి

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమంలో అదనపుఈవో

# తిరుమల పవిత్రతను కాపాడండి

తిరుమల:పవిత్ర పుణ్య క్షేత్రమైన తిరుమలలో భక్తులు తాము ప్రయాణం చేసే వాహనాల నుండి రోడ్లపై చెత్తను విసరడం మానుకోవాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమలలో భాగంగా శనివారం ఉదయం మొదటి ఘాట్ రోడ్ లోని కుంకాల పాయింట్ వద్ద ఆయన సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ వాహనదారులు ప్లాస్టిక్ కవర్లు, తిను బండారాలు, వాటర్ బాటిళ్లను తీసుకొచ్చి రోడ్ల పక్కన విసిరి వేస్తున్నారని చెప్పారు. దీంతో కొంతకాలంగా పెద్ద ఎత్తున చెత్త పోగయ్యిందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమలలో భాగంగా మొదటి ఘాట్ రోడ్డులో ఈ చెత్తను తొలగించాలని నిర్ణయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 400 మంది టీటీడీ సిబ్బందితో పాటు-పోలీసులు,తిరుమల స్థానికులు స్వచ్ఛందంగా వచ్చి ఈ కార్యక్రమంలో భాగమయ్యారని చెప్పారు. చెత్తను శుభ్రం చేయడంతో పాటు భవిష్యత్తులో రోడ్డుపై చెత్త విసరకుండా డస్ట్ బిన్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులందరూ ఆ డస్ట్ బిన్ లలో చెత్త వేయాలి తప్పా వాహనంలో ప్రయాణిస్తూ రోడ్డుపై చెత్త విసరడం మంచి పద్ధతి కాదని అన్నారు. తిరుమలను పరిశుభ్రంగా ఉంచేందుకు 6వేల మంది సిబ్బంది నిరంతరాయంగా కృషి చేస్తున్నారని, వారి కృషిని, తిరుమల పవిత్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాల నుండి బయటకు చెత్త విసరడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని, స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా దిగువ ఘాట్ మార్గంలో ఎనిమిది ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్త తొలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ డిప్యూటీ ఈవో రాజేంద్ర, గార్డెన్ డిప్యూటీ- డైరెక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, వీజీవోలు సురేంద్ర, సదాలక్ష్మీ, ఇతర పోలీసు అధికారులు, పలు శ్రీవారి సేవకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.




2లో..

## కొత్తగా పది పోలీస్ స్టేషన్లు ఏర్పాటు

జిల్లాకో సైబర్ క్రైమ్ పోలీస్ల స్టేషన్

గుంటూరు రేంజ్ అధికారులతో హోంమంత్రి సమీక్ష




2లో..

## అవిశ్వాసం గెలిచినా.. విశ్వాసం కోల్పోయారు

మేయర్ పీఠంతో భూములు కాజేసే యత్నం

మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ సంచలన వ్యాఖ్యలు

## కన్నీళ్లు పెట్టించిన చిన్నారి సాత్విక ప్రసంగం

నాన్న లేకున్నా..

అమ్మ కష్టపడి చదివిస్తోంది

అమ్మకోసం ఇకనుంచి మంచిగా చదువుకుంటా

భావోద్వేగానికి గురైన హరీష్ రావు



2లో..

## బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదు

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు భారాస దూరంగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు భారాస దూరంగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ భారాస నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదని చెప్పారు. ఎన్నికకు హాజరు కావద్దని పార్టీ తరఫున విప్ కూడా జారీ చేస్తామని చెప్పారు. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీకి కాంగ్రెస్, భారాస దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే."కాంగ్రెస్, తెదేపా, భాజపాను ఎదుర్కొని కేసీఆర్ పార్టీ పెట్టారు. కేసీఆర్ దీక్ష, పోరాటంతోనే తెలంగాణ వచ్చింది. ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా భారాస సమర్థంగా పోషిస్తుంది. చేసినవి చెప్పుకోనందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం.

17 నెలల్లో భారాస గ్రాఫ్ బాగా పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం హైడ్రా, మూసీ, హెచ్‌సీయూ భూముల పేరుతో అరాచకాలు చేస్తోంది. రాష్ట్ర భాజపా ఎంపీలు కాంగ్రెస్‌ను ఒక్క మాట కూడా అనరు. 17 నెలల్లో తెలంగాణకు భాజపా ఒక్క పైసా పని చేయలేదు. హెచ్‌సీయూ భూములపై మోదీ ఎందుకు విచారణ జరిపించట్లేదు? తెలంగాణ కాంగ్రెస్, భాజపా ఒక్కటే. మతం పేరిట రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఆమోదించరు" అని కేటీఆర్ తెలిపారు.





2లో..

## చర్యలు అందరిపైనా.. తనపైనేనా

మరోమారు స్మితా సబర్వాల్ పోస్ట్

# అభివృద్ధిలో ప్రపంచంతో తెలంగాణ పోటీ



ఢిల్లీ పరిస్థితులు చూసి గుణపాఠం తెచ్చుకోవాలి

మూసీరివర్ ఫ్రంట్ అభివృద్ధికి కొందరు అడ్డు

జపాన్ తెలుగు సమాఖ్య సదస్సులో సిఎం రేవంత్

తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటుతో ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చు. ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి.

**హైదరాబాద్:** అభివృద్ధిలో ప్రపంచంతోనే తెలంగాణ పోటీ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్.. శనివారం జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో జపాన్‌లోని తెలుగు వారు భాగం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఐటీ,

మిగతా 2లో



2లో..

## మరోమారు హైడ్రా దూకుడు

ఎపి ఎమ్మెల్యే ఫామ్‌హౌజ్ కూల్చివేత

మియాపూర్‌లోనూ ఆక్రమణల తొలగింపు



## చర్యలు అందరిపైనా..తనపైనేనా మరోమారు స్మితా సబర్వాల్ పోస్ట్

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం తీరును ప్రతిపక్ష పార్టీలు సహా పలువురు ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు ఎండగడుతున్నారు. ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ కు తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు పంపిన నోటీసులపై స్మితా సబర్వాల్ తాజాగా స్పందించారు. గచ్చిబౌలి పోలీసులకు తాను పూర్తిగా సహకరించినట్లు- చెప్పారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు- తెలిపారు. ఆ పోస్టును తాను రీపోస్టు చేసినట్లే 2 వేల మంది షేర్ చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటారా..? చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత కోరినట్లు- స్మితా సబర్వాల్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ట్విట్టర్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేసిన గిబ్లి తరహాలో ఉన్న ఇమేజ్‌ని స్మితా సబర్వాల్ రీటీ–÷–వట్ చేశారు. సేవ్ హైదరాబాద్, సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ– అని పేర్కొన్నారు. ఆ పోస్టులో మష్రూమ్ రాక్ ఎదుట భారీ సంఖ్యలో బుల్డోజర్లు మోహరించగా, బుల్డోజర్లకు ఎదురుగా నెమలి, జింకలు ఉన్నాయి. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఇది ఫేక్ ఫొటో అంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు బీఎన్ఎస్ 179 సెక్షన్ కింద స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీ–సులు పంపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేసిన పోలీసులు విచారణకు పిలుస్తున్నారు.

# కొత్తగా పది పోలీస్ స్టేషన్లు ఏర్పాటు

గుంటూరు:కొత్తగా పది పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. జిల్లాకు ఒక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తాని కూడా అన్నారు. గుంటూరు రేంజ్ పరిధిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు హోంమంత్రి.. గుంటూరు, రాజధాని అమరావతి, హైకోర్టు, పొలిటికల్ పార్టీల ఆఫీసులు ఈ ప్రాంతంలో ఉన్నాయని.. పల్నాడులో ఫ్యాక్షన్ కొన్నిచోట్ల ఉంది.. నలభై గ్రామాల్లో ఫ్యాక్షన్ కనిపిస్తుందన్నారు.. ఇక, సైబర్ క్రైమ్ ప్రకాశం జిల్లాలో జీరో వెల్లడించారు. గుంటూరు జిల్లాలో అనేక కేసుల్లో రికవరీ బాగుందన్న ఆమె.. పోలీసుల భద్రత చూడాల్సిన అవసరం ఉంది. గుంటూరు జిల్లాలో పోలీసులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇక, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముప్పై పోక్సో కేసుల్లో శిక్షలు పడ్డాయని హోం మంత్రి అనిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 కోట్లు- ఖర్చు పెట్టి సీసీ



కెమెరాలు ఏర్పాటు చేశాం. పబ్లిక్, ప్రైవేట్ ప్లేసులలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరారు.. మరోవైపు, బాపట్ల సముద్రతీరప్రాంతంలో డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రజల రక్షణే భద్రతగా పోలీసులు పనిచేస్తున్నారు. కొత్తగా పది పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రమోషన్ల విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి... వాటిపై దృష్టి పెడతామన్నారు.. గత ఐదేళ్లలో పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా అక్కడ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి చీపురు పట్టారు. పారిశుధ్య సిబ్బందిని అభినందించారు.

# గాజాపై బాంబుదాడి

## 70మంది పాలస్తీనియన్ల మృతి



గాజా: ఇజ్రాయిల్ సైన్యం గాజాపై మరోసారి బాంబుదాడికి పాల్పడింది. శుక్రవారం ఇజ్రాయిల్ సైన్యం గాజాలోని ఓల్డ్ సిటీ తుఫాతో సహా పలు ప్రదేశాల్లో ఇళ్లపైనా, సహాయక శిబిరాలపైనా బాంబు దాడికి పాల్పడింది. ఈ దాడి వల్ల 70 మందికిపైగా పాలస్తీనియన్లు మృతి చెందినట్లు వైద్య వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఇజ్రాయిల్ పాల్పడుతున్న వరుస దాడులవల్ల పాలస్తీనా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. తక్షణమే గాజా ప్రజలకు ఆహారం అవసరం అని.. తక్షణమే వారికి ఆహారాన్ని అందించాలని ఐక్యరాజ్యసమితి యొక్క ఆహార కార్యక్రమం అత్యవసర హెచ్చరికను జారీ చేసింది. కాగా, ఇజ్రాయిల్ బాంబు దాడుల వల్ల పాలస్తీనా ప్రజలు మానసికంగా ఎంతో కుంగిపోయారు. ఇజ్రాయిల్ దిగ్బంధనం వల్ల ప్రజలు వారి పిల్లలకు కనీసం ఆహారం కూడా పెట్టు–కోలేని దీనావస్థలో ఉన్నారని గాజాలోని మీడియా ప్రతిధి తెలిపారు.

# అవిశ్వాసం గెలిచినా..విశ్వాసం కోల్పోయారు



విశాఖపట్టణం: గ్రేటర్ విశాఖ మేయర్ పీఠాన్ని కూటమి దక్కించుకున్నా ప్రజల మనసుల్లో మాత్రం కూటమి ఓడిందని మాజీమంత్రి వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ అన్నారు. మేయర్ పీఠాన్ని అడ్డం పెట్టుకుని అప్పనంగా భూములు దోచుకునే కార్యక్రమంలో కూటమి నేతలు ఉన్నారని విమర్శించారు. వైసీపీ మేయర్‌పై అవిశ్వాస పరీక్షలో ఓటమిపాలయ్యారు.. అయితే, మేయర్ మీద అవిశ్వాసం గెలిచారు.. కానీ, విశాఖ ప్రజల మనసుల్లో విశ్వాసం కోల్పోయారు అంటూ వ్యాఖ్యానించారు. విశాఖ మేయర్ ఎన్నికల్లో పరిణామాలపై ఆయన స్పందిస్తూ.. బలం లేకుండా అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారని.. ధర్మం, న్యాయం గురించి మాట్లాడే హక్కు కూటమి నాయకులకు లేదని దుయ్యబట్టారు.. అయితే విప్ ఉల్లంఘించిన వారి పదవులు పోవడం ఖాయం అన్నారు.. యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళకు మా నాయకుడు జగన్.. మేయర్ పదవి ఇచ్చారు.. కానీ, ప్రత్యేక విమానాలు ఏర్పాటు– చేస్తామని ప్రలోభ పెట్టారని మండిపడ్డారు. ఇక, 99 పైసలకే విశాఖ భూములను ఇష్టానుసారంగా కట్టబదుతున్నారు.

ఇదే తరహాలో భూముల కట్టబెడతామని మంత్రి నారా లోకేష్ చెప్తున్నారు.. అసలు టీ–సీఎస్ విశాఖ రాకముందే భూములు అప్పనంగా కట్టబెడుతున్నారని విమర్శించారు.. విశాఖ మేయర్ పీఠం చేతిలో ఉంచుకొని విశాఖను దోచుకోవాలను చూస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. జీవీఎంసీ మేయర్ పై అవిశ్వాస పరీక్షపై స్పందించిన వైసీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు.. కూటమి చావు బతుకుల మీద మ్యాజిక్ ఫిగర్ చేరుకుంది.

చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు గెలిచారు. కుట్రలు, కుతంత్రాలకు తెర తీశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని మండిపడ్డారు.. విలువలు విశ్వాసనీయత లేని వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు.. యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళను జగన్ కూర్చోబెట్టారు.. కూటమిని తట్టుకొని నిలబడ్డ వైసీపీ కార్పొరేటర్లకు చేతులెత్తి నమస్కరిస్తున్నాం అన్నారు.. జగన్ సీఎంగా ఉన్నా టీడీపీ గెలిచిన మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ల పదవులు లాక్కోలేదన్నారు కురసాల కన్నబాబు..

## అభివృద్ధిలో ప్రపంచంతో తెలంగాణ పోటీ




ఫార్మా రంగంలో ప్రగతి సాధించామని.. రాష్ట్రంలో త్వరలోనే డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. టోక్యోలో రివర్ ఫ్రంట్‌ను పరిశీలించామన్నారు. మూసీనది ప్రక్షాళనకు కొందరు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీ పరిస్థితి చూసి మనం గుణపాఠం నేర్చుకోవాలన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని.. ప్రపంచంతో పోటీ–పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఐటీ–, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకం. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటు–తో ప్రపంచంతోనే మనం పోటీ–పడొచ్చు. ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## గుజరాత్‌లో బిజెపిని ఓడించి తీరుతాం

**అహ్మదాబాద్:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, బీజేపీని ఓడించగలిగే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నైతిక్థసైర్యం కోల్పోయినట్టు కనిపిస్తున్న ప్పటికీ రాష్ట్రంలో బీజేపీని ఓడిస్తామని పార్టీ సీనియర్ నేత,లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. గుజరాత్‌కు చెందిన ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ...ఆర్ఎస్ఎస్, బీజేపీని ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఓడించగలదనే విషయం ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. దీనిపై జిల్లాలకు చెందిన సీనియర్ నేతలను తాను కలుసుకున్నానని, చక్కటి చర్చలు జరిగాయని తెలిపారు. పార్టీలోని అంతర్గత సవాళ్లను పరిష్కరించేందుకు రాష్ట్రంలో కొత్త నాయకత్వాన్ని పరిచయం చేస్తామని చెప్పారు. ఇటీవల రాహుల్ గాంధీ మోడాసాలో జరిగిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఇదే విషయం స్పష్టం చేశారు. పార్టీ వ్యూహాలను వివరిస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గుజరాత్‌లో పార్టీని పునర్వవస్థీకరించేందుకు తీసుకుంటున్న చర్యలను రాహుల్ ప్రస్తావిస్తూ, దీనిపై చాలా నెలలుగా పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం పోరాటం కాదని, సైద్ధాంతిక పోరాటమని అన్నారు. నాయకుల మధ్య పోటీ వినాశకరమని, నిర్మాణత్మకం కాదని నేతలు తనకు చెప్పారని అన్నారు. పార్టీలో నాయకత్వ సవాళ్లను గురించి మాట్లాడుతూ, గుర్రాలలో రెండు రకాలు ఉంటాయని, ఒకటి రేసులకు ఉద్దేశించినవని, రెండో రకం పెళ్లిళ్లకు ఉద్దేశించినవని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కొన్నిసార్లు వెడ్డింగ్ హార్స్‌లను రేసులకు, రేసింగ్ హార్స్‌లను పెళ్లిళ్లకు పంపుతున్నట్టు నాయకులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. సరైన నేతలకు సరైన బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు.

# బెంగాల్లో మమతాబెనర్జీ రాజకీయ కుయుక్తులు !



పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలు క్షీణిస్తున్నా.. అల్లర్లు పదేపదే చోటుచేసుకుంటున్నా..సిఎం మమతా బెనర్జీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటోంది. తరచుగా అల్లర్లు జరుగుతున్నా వాటిని కఠినంగా అణచివేయడం లేదు. ఎప్పుడూ కేంద్రంపై తాచుపాములా బుసలు కొట్టడమే తప్ప అక్కడ శాంతిభద్రతలను కాపాడడంలో మాత్రం ఘోరంగా విఫలం అవుతున్నారు. ఒకటికాదు..రెండు కాదు వరుస ఘటనలు అక్కడి ప్రశాంతతను దెబ్బతీస్తోంది. ఇదంతా కేవలం రాజకీయ ప్రాపకం కోసం చేస్తున్న ఎత్తుగడగా విమర్శలు ఉన్నాయి. వచ్చే యేదాది ఎన్నికల్లో మళ్లీ గెలవడమే లక్ష్యంగా మమతా బెనర్జీ కుయుక్తులు పన్నుతున్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద లాంటి వారు జన్మించిన నేల ఇప్పుడు రక్తసిక్తంగా మారుతోంది. కేవలం రాజకీయాలు చేయడం అలవాటు చేసుకున్న మమతకు స్వరాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో మాత్రం శ్రద్ధ లేకుండా పోయింది. అనేక సమస్యలు బెంగాల్‌ను ఆవరించాయి. ప్రధానంగా శాంతిభద్రతలు అదుపు తప్పాయి. అత్యాచార ఘటనలు పెరిగాయి. బంగ్లా నుంచి చొరబాట్లు పెరిగాయి. అక్రమ వసలదారులు అక్కడ తిష్టవేసి, ఆధార్ సహా అన్నీ పొందుతున్నారు. వారిని తన్ని తరిమేమకుండా వారికి సౌకర్యాలు కల్పించి, ఓటుబ్యాంక్‌గా మార్చుకున్న తీరు క్షమించరానిది. బంగ్లాదేశ్ నుంచి వేలాది మంది ఏటా వస్తూనే ఉన్నారు. దీంతో స్థానికంగా అల్లర్లకు వారు కూడా కారణం అవుతున్నారు. మైనార్టీలను బుజ్జగించే పనిలో అక్రమ వలసదారులను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అందుకే ఒకదాని వెంట ఒకటిగా చోటుచేసుకుంటున్న ఘటనలు ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలకు సవాలుగా పరిణమించాయి. సమస్యలను అర్థం చేసుకోకుండా కేంద్రాన్ని దుమ్మెత్తిపోయడం, బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను తిట్టిపోయడంలో మమతా బెనర్జీ ఆరితేరారు. గతేడాది పార్ల మెంటు ఎన్నికలకు ముందు జరిగిన సందేశ్ ఖలీ మానభంగాల కేసు విషయంలో నిజాయితీగా వ్యవహరించలేక పోయారు. అలాగే గత ఏడాది చివర్లో కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులోనూ కఠినంగా వ్యవహరించలేకపోయారు. ఇవి ఎంతటి పెను వివాదాలకు కారణమయ్యాయో తెలిసిందే. ఈ మధ్య 26 వేల మంది స్కూలు టీచర్ల నియామకాలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టడంతో మరో వివాదం దీదీ ప్రభుత్వాన్ని అతలాకుతలం చేసింది. వీటికితోడు తాజాగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లు మొదలయ్యాయి. వీటిని అణచివేయకుండా కేంద్రాన్ని తిట్టిపోస్తూ... వక్ఫ్ చట్టం బెంగాల్లో అమలు కాదని ప్రకటన చేశారు. మెడికల్ విద్యార్థి హత్యాచార ఘటనలో దేశవ్యాప్తంగా ఆందోళనలను చెలరేగాయి. కోల్‌కతాలో వైద్యుల నిరసనలు నెలలతరబడి సాగాయి. అయినా సిఎంగా మమతా బెనర్జీ సమర్థంగా వ్యవహరించలేకపోయారు. గత పదేళ్ల కాలంలో మొత్తం వ్యవహారాలను పరిశీలిస్తే కేవలం అధికార యావతప్ప మమతలో మరోటి కానరాదు. తన అధికారం నిలబెట్టుకునే÷–ందుకు ఆమె ఆందోళనలు ప్రోత్సహించడంతో పాటు..వాటిని ఉపేక్షిస్తారు. ఈ క్రమంలో తాజాగా వక్ఫ్ సవరణ చట్టం అమలులోకి రాగా, దేశంలో ఎక్కడా లేనంత తీవ్ర స్థాయిలో బెంగాల్‌లో అల్లర్లు మొదలయ్యాయి. నిజానికి యూపిలాంటి రాష్ట్రాల్లో కూడా అల్లర్లు జరగలేదు. ముస్లిం జనాభా ఎక్కువగా గల ముర్షీదాబాద్, మాల్దా, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాలు నిరసనలతో అట్టుడికాయి. ఈ అల్లర్ల వల్ల ముగ్గురు బలికాగా, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు భారీస్థాయిలో ధ్వంసమయ్యాయి. నిరసనకారులు ప్రధాన రహదారుల్ని, రైల్వే ట్రాకుల్నీ దిగ్బంధం చేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి మమత హామీ ఇచ్చినా అల్లర్లు తగ్గుముఖం పట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బెంగాల్లో మమతా బెనర్జీ ముందునుంచీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తూ వచ్చారు. దీంతో అక్రమంగా వలసవచ్చిన వారు పాతుకు పోయారు. అల్లర్లలో వారే ప్రధాన పాత్ర పోషిస్తు న్నారని బిజెపి ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలో విపక్ష భారతీయ జనతాపార్టీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ స్వప్రయోజనాలపై పోరాటం చేస్తూనే ఉంది. మమత తీరును ఎండగడుతూ నే ఉంది. రోహింగ్యాలతో పాలు, అక్రమంగా సరిహద్దులు దాటి వస్తున్న వారిని అడ్డుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. జరిగిన సంఘటనలకు బాధ్యత మీదంటే మీదే బాధ్యతంటూ ఇరు పార్టీలు దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. బెంగాల్‌లో ఎప్పుడు అల్లర్లు చెలరేగినా వాటిని కఠినంగా అణచివేయడంలో మమత బెనర్జీ ప్రభుత్వ విఫలం అవుతూనే ఉంది. ఇదంతా బిజెపి ప్లాన్ అంటూ తోసిపుచ్చడం, విమర్శలతో ఎదురుదాడి చేయడం అలవాటు చేసుకున్నారు. ఇటీ–వల 26 వేల మంది టీచర్ల నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ ప్రతిష్ఠ మంటగలవడంతో దానినుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు వేసిన ఎత్తుగడలో భాగంగానే అల్లర్లను ప్రేరేపించారనని బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. దీనిని అడ్డుకు నేందుకు ముఖ్యమంత్రి.. వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిన కేంద్రమే అల్లర్లకు బాధ్యత వహించాల నే రీతిలో మాట్లాడుతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన చట్టం గురించి కేంద్రాన్నే అడగాలని, రాజకీయాలకోసం అల్లర్లకు దిగవద్దని ఆమె ఇచ్చిన పిలుపునకు నిరసనకారులు ఏమాత్రం స్పందించడం లేదు సరికదా మరింత పేట్రేగిపోయారు. అల్లర్లకు కేంద్ర బిందువైన ముర్షీదాబాద్ జిల్లాలో ముస్లిం జనాభాదే ఆధిపత్యం. ఈ జిల్లాలోని మూడు పార్లమెంటు సీట్లనూ తృణమూల్ గెలుచుకుంది. 22 అసెంబ్లీ స్థానాల్లో 20 సీట్లకు తృణమూల్ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీదే పైచేయి. అలాంట ప్పుడు, అల్లర్లు ఎలా చెలరేగాయన్న ప్రశ్నకు అధికార పార్టీనుంచి జవాబు లేకపోవడం గమనార్హం.గతంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడూ ముర్షీదాబాద్

భగ్గుమంది. ఇంతటి సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంలో ముందుజాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రభుత్వమే జవాబు చెప్పాలి. వక్ఫ్ చట్టంలో లొసుగులున్నాయని ఎవరైనా భావిస్తే, వాటిని న్యాయస్థానాలలో సవాల్ చేసే హక్కు ఉంది. అంతే తప్ప, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అల్లర్లకు దిగడం సమంజసం కాదు. అయితే ఇక్కడ మమతా బెనర్జీ అల్లర్లను అదుపు చేయకుండా ప్రేక్షక పాత్ర వహించడంపై సర్వత్రా అనుమానాలు ఉన్నాయి. బాధ్యతా యుతమైన సిఎం పదవిలో ఉన్న దీదీ పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని అమలు చేయబోమని ఎలా చెబుతారనేది ప్రజలకు వివరణ ఇవ్వాలి. టిఎంసి ప్రభుత్వం అల్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేసి, తన చిత్తశుద్ధిని నిరూపించుకుని ఉంటే అనుమానాలు వచ్చేవి కావు. మరో ఏడాదిలో శాసనసభ ఎన్నికలకు సమాయత్తమవుతున్న బెంగాల్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు కేవలం రాజకీయం కోసమే అన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓటు బ్యాక్ రాజకీయాల కోసం చేసే చర్యలను అడ్డుకోవాల్సిందే.

# మరోమారు హైడ్రా దూకుడు

హైదరాబాద్: హైడ్రా మరోమారు దూకుడు పెంచింది.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ఆక్రమణలకు పాల్పడింది ఎవరన్నది చూడకుండా కూల్చివేతలే టార్గెట్ గా వెళ్తున్న హైడ్రా ఇప్పుడు ఏపీ టీడీపీ ఎమ్మెల్యేకు భారీ షాక్ ఇచ్చింది. ఏపీలోని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు చెందిన ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు. శనివారం కొండాపూర్ లోని సర్వే నంబర్ 79లో ఉన్న ఎమ్మెల్యే ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఫామ్ హౌస్ తో పాటు ఆఫీస్ నిర్మించినట్లు అధికారులు తెలిపారు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్ లో ఉండగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నిర్మాణాలు చేపట్టారని..సర్వే నెంబర్ 79 లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు అధికారులు. ఇకపోతే అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మియాపూర్ వరల్డ్ వన్ స్కూల్ వెనుక ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేస్తోంది. షెడ్లను జెసిబిల సహాయంతో కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగాయి. గతంలో సంబంధిత వ్యాపారులకు నోటీసులు ఇచ్చిన స్పందించకపోవడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ లోని సర్వే నెంబర్ 213, 214 ,215 ,216 లో స్కూప్స్ ఐస్ క్రీమ్ కంపెనీ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. దీంతో శ్రీరంగపురం కాలనీ, సుందరయ్య కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ లతో పాటు– సుమారు 7, 8 కాలనీ స్థానికులు హైడ్రా అధికారుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. రహదారి కబ్జా చేసి చుట్టూ కొంతమంది వ్యక్తులు ప్రహరీ గోడ నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని వాపోయారు. అక్రమ కట్టడాలపై ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న నాధుడే లేడని.. కానీ, ముత్యాలమ్మ అనే మహిళ ఒంటరి పోరాటం చేస్తూ హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదుతో హైడ్రాధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేయడం సంతోషంగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి బాధిత కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కన్నీళ్లు పెట్టించిన చిన్నారి సాత్విక ప్రసంగం



**సిద్దిపేట:** ముక్కుపచ్చలారని ఓ చిన్నారి కథ విని మాజీ మంత్రి హరీశ్‌రావు భావోద్వేగానికి లోనయ్యారు. తండ్రి చనిపోయినా కష్టపడి చదువుతున్న ఆ చిన్నారి కథ విని కన్నీళ్లు పెట్టుకున్నారు. సిద్దిపేటలో స్కూల్ విద్యార్థులకు 'భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి' అనే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి మాట్లాడుతూ.. నా పేరు సాత్విక.. నేను ఇక్కడికి రావడానికి మా అమ్మే కారణం.. నేను సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు మా నాన్న చనిపోయాడు. అప్పటినుంచి మా అమ్మే నన్ను మంచిగా చూసుకుంటుంది. కానీ నేనే ఊరికే తిడుతుండేదాన్ని. నేను ఇప్పటినుంచి మా మమ్మీని మంచిగా చూసుకుంటాను. మా మమ్మీకి మంచి పేరు తీసుకువస్తాను. ధన్యవాదాలు అని ఆ చిన్నారి వలవలా ఏడ్చేసింది. ఇక ఆ చిన్నారి చెప్పిన మాటలకు.. హరీశ్‌రావు కూడా కన్నీరు పెట్టుకున్నారు. సాత్వికను దగ్గరకు చేరదీసి ఏడ్వొద్దని చెప్పారు. తన పక్కన కూర్చోబెట్టుకుని ఆ పాపను ఓదార్చారు.

అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. అమ్మానాన్నల గౌరవాన్ని తమకు అర్థమయ్యేట్టు- చెప్పి, వాళ్ల విలువ తెలిసేటట్టు- చెప్పి, మనందరికి కళ్లు తెరిపించినటువంటి పిల్లలను చప్పట్లతో అభినందించాలి. ఈ పిల్లల బాధలు విని ప్రతి ఒక్కరూ రియలైజ్ కావాలి. తల్లిదండ్రుల విలువ ఏంటో అర్థమైందని అనుకుంటున్నా.. ఐ లవ్ మై పేరెంట్స్, ఐ లవ్ మై టీచర్స్ అని ప్రామిస్ చేయండి.. జీవితాంతం తల్లిదండ్రులు, టీచర్లను ప్రేమించాలి. అమ్మ కంటే మంచి కోరుకునే వారు ఈ భూమ్మీద ఎవరూ ఉండరు. ఫోన్లు చూస్తూ టైమ్ వేస్ట్ చేయొద్దు. అమ్మ మాట వినండి.. గౌరవించండి.. ఇవాళ్టి నుంచి మీ అందరిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. గీత్త

- పీఎం సూర్యగర్ పథకాన్ని సద్వినియోగం
- వ్యర్థ పదార్థాలపై అవగాహన కల్పించాలి.
- స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దుదాం
- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి ఏప్రిల్ 19 -**



: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు చెత్త సేకరణకు సంబంధించి వ్యర్థ పదార్థాలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రభుత్వ శాఖల అధికారులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో గ్రామ సర్పంచ్ రవి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కు గ్రామ సర్పంచ్ పుష్పగుచ్ఛం అందజేసి, పూలమాలవేసి దుష్యాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ఎమ్మెల్యే డ్రైనేజీ కాలువల పూడికను తీసి , చీపురు పట్టి రోడ్డు శుభ్రం చేస్తూ ,చెత్తను సేకరించి డస్ట్ బిన్ లో వేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని , పరిశుభ్రంగా లేకపోతే రోగాల బారిన పడతారని తెలిపారు.స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని చంద్రబాబు నాయకత్వంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎం సూర్యగర్ పథకమును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంతేకాక ఏమీ ఖర్చు లేకుండా దొరికేది ఎండా సోలార్ ఫ్యాన్ పెట్టుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు కూడా తగ్గిపోతాయన్నారు.ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్(ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందన్నారు.పాడైపోయిన కీబోర్డు, మౌస్, మానిటర్స్, సిపియు, యుపిఎస్, స్టెబిలైజర్ ఇతర కంప్యూటర్ పరికరాల జాబితాను తయారుచేసి ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూస్) సెంటర్లకు తరలించి సంబంధిత జాబితాపై రసీదు తీసుకోవాలని డి. ఆర్ .డి .ఏ పి .డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. పనికిరాని పరికరాలకు సంబంధిత ఏజెన్సీ వారు వెలకట్టి నగదు మొత్తాన్ని అందజేస్తారన్నారు.అధికారులందరూ సంబంధిత మండలాల్లో, గ్రామాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛ్ ఆంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరినీ భాగస్వాములు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, ఆర్డబ్ల్యూఎస్ డీఈ అంజలీదేవి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు , మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు పట్టణంలో జామియా మసీద్ ఆధ్వర్యంలో జామియా మసీద్ నుండి సోమప్ప సర్కిల్ వరకు వాక్ బోర్డ్ బిల్ వ్యతిరేకముగా శాంతియుత ర్యాలీ నిరసన చేయడం జరిగింద.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు ఏప్రిల్ 19 శనివారం అనంతరం MRO ఆఫీసులో జామియా మసీద్ ఆధ్వర్యంలో మత గురువులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది భారీ ఎత్తున ముస్లిం మైనార్టీ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ముస్లిం మైనార్టీ సోదరులకు అక్క చెల్లెళ్లకు మరియు ఎమ్మిగనూరు మండలం నందవరం మండలం గోనెగండ్ల మండలం ముస్లిం సోదరులు కూడా పేరుపేరునా అందరికీ జామియా మజీద్ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపినారు ఈ కార్యక్రమంలో జామియా మజీద్ ఖాసిం బేగ్ . రసూల్ . సయ్యద్ చాంద్ .. అల్లావుద్దీన్ దౌలా . యూసుఫ్ మోలా అన్నగారు సిఫత్ మౌలానా అతావుల్లా మౌలానా కైర్ ఉల్లా మౌలానా అల్తాఫ్ దర్గా కమిటీ సభ్యులు ఇమ్రాన్ వహీద్ అన్వర్భ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు

## ఎమ్మిగనూరులో ఘనంగా జరిగిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు ఏప్రిల్ 19 శనివారం**




శనివారం ఉదయం ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక చర్చి పాస్టర్ ల కమిటీ ఆధ్వర్యంలో యేసు కోసం పరుగెడుదాం,రన్ ఫర్ జీసస్ అనే కార్యక్రమం భారీ జన సందోహంతో ఉత్సాహంగా జరిగింది. పట్టణంలోని స్థానిక ఎంబీ ఎరుషలేము చర్చి నుండి షరాఫ్ బజార్ మీదుగా అంబేద్కర్ సర్కిల్,సోమప్ప సర్కిల్, శివా సర్కిల్ గాంధీనగర్,వైయస్సార్ సర్కిల్, శ్రీనివాస్ టాకీస్, మరియు సోమేశ్వర టాకీస్, చివరగా ఎంబి చర్చ్ వరకు చేరుకొని కార్యక్రమం ముగిసినది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం క్రైస్తవుల ఐక్యతను సమాజంలో చాటుట కొరకై అలాగే సమాజంలో శాంతియుతంగా సమాజ స్థాపనకు క్రైస్తవుల యొక్క ముఖ్యపాత్రను ఏసుక్రీస్తు రూపంలో సర్వ మానవాళికి తెలియజేయాలని, ఈ కార్యక్రమం ద్వారా ఈ విధంగా తెలియజేయుటకు ప్రతి ఒక్కరూ భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు స్థానిక చర్చి సంఘ కాపరుల కమిటీ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో ఎంబీ యెరుషలేము చర్చి సంఘ కాపరి జయన్న, ఆర్సీఎం చర్చి ఫాదర్ చిన్నప్ప, బెతెస్త సంఘ కాపరి యాకోబు,సీఎస్ఐ ముగతి పాస్టర్ షేతు, సిఎస్ఐ పట్టణ (టూ)పాస్టర్ జీవన్ బాబు అలాగే రన్ ఫర్ జీసస్ ఆర్గనైజర్స్ కదిరికోట వెస్లీ సునీల్, ఉదయ్, విజయ్,కిట్టు,అనిల్, ప్రవీణ్, కిషోర్,అలాగే అన్ని సంఘాల సభ్యుల లోని పెద్ద ఎత్తున మహిళలు,యువకులు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు ఏప్రిల్ 19 కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను చట్టాలను రద్దు చేయాలని మే 20న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి సిఐటియు పిలుపు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు ఏప్రిల్ 19 శనివారం ఈ దినము సిఐటియు అనుబంధ సంగాల కార్యకర్తల విస్తృత సమావేశం సిఐటియు ఆఫీసు నందు సిఐటియు మండల ఉపాధ్యక్షులు బి గోవర్ధనమ్మ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు మండల కార్యదర్శి పి గోవిందు బి రాముడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 2020 కరోనా సమయంలో కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను 29 సాధించుకున్నారని తెలిపారు కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను కేవలం నాలుగు లేబర్ చట్టాలుగా అమలు చేస్తుందని దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు బ్రిటిష్ కాలంలో 1926 సంవత్సరములో ఏడు మంది కార్మికులతో యూనియన్ ఏర్పాటు చేసుకున్న చట్టం వచ్చిందని ప్రస్తుతము కొత్త చట్టం 100 మంది ఉంటే సంఘం ఏర్పాటు చేయాలని షరతులు పెట్టడం జరిగింది వేతనాల పెంపు చట్టం 1936లో పోరాడి సాధించుకున్నారని ప్రస్తుతం ప్రభుత్వం కేవలం 178 రూపాలు మాత్రమే సరిపోతుందని బిజెపి ప్రభుత్వం నిర్ణయించడం సరైనది కాదన్నారు సమ్మె హక్కు చట్టం సమాన పనికి సమాన వేతన చట్టం గ్రాజువిటీ చట్టం పెన్షన్ చట్టం వీటి అన్నిటిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది బిల్డింగ్ కార్మికులు 1996లో శేష చట్టం వచ్చిందని ఈ చట్టం కూడా సెస్సు వసూలు చేయకూడదని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందని తెలిపారు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను రద్దుకై మే 20న దేశవ్యాప్త సమ్మెను సంఘటిత అసంఘటిత కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ గౌరవేతనం కార్మికులు వీరికి నష్టం కలిగిస్తున్న చట్టాలను రద్దుకై సమ్మెలో పాల్గొనాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఈ రంగన్న గౌడ్ జి నాగరాజు ఎస్ నాగలక్ష్మి కే శైలజ బి నీరజ శ్రీ రామన్న డి ఉస్మాన్ వలి బి శివలక్ష్మి బి కేసన్న సి నారాయణ సుజాత తిమ్మప్ప లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు

## బేతంచెర్ల లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం



**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



: మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్,జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వర్లు,అన్నారు శనివారం బేతంచర్ల పట్టణంలోని నగర పంచాయతీ సిబ్బంది పొదుపు మహిళలు ఆశ వర్కర్లు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల కొట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలోఅర్బన్ ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సేవలను బాలింతలు గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

అంగన్వాడి సెంటర్లో గర్భిణీలకు శ్రీమంతాలు

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఏప్రిల్ 19:**




గ్రామీణ పోషకాహార లోపాన్ని నివరించడమే లక్ష్యంగా. అంగన్వాడి సెంటర్ల ద్వారా అందించే పోషక ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో ఐసిడి ఎస్ నందికొట్కూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక సిడిపిఓ కార్యాలయంలో మండల స్థాయి ఫోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకం తోపాటు గర్భిణీ స్త్రీలు, బాలం తలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. మొదటి 1000 రోజుల ప్రాము ఖ్యత గురించి గర్భ ధారణ ప్రారంభం, 0 వయసు నుండి 2 సంవత్సరాలపిల్లల వయసు వరకు పోషక ఆహారపదా ర్థాల వల్ల కలిగే ఉపయోగం గురించి తెలిపారు.గర్భిణులు నమోదు నుంచి రెండు సంవత్సరాలలోపూ పిల్లలు పెరిగినంత వరకూ పోష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా నివారించాలంటే ఏం చేయాలో వివరించడం జరిగిందని అన్నారు.చిరుధాన్యాలలో అధిక పోషక విలువగల పదార్థాలు ఉంటాయని, గర్భిణీలు బాలింతలు ఈ ఆహారాన్ని తీసుకోవాలని, గర్భవతులు బాలింతలు సరైన సమయాల్లో పౌష్టిక ఆహారం తీసుకోని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. తల్లులకు, గర్భిణీ స్త్రీలకు, బాలికలకు మిల్లెట్స్ గురించి, రక్తహీనత, చిరుధాన్యాలపై అవగాహన కల్పించే బాధ్యత ఐసిడిఎస్ అధికారుల దేనిని అన్నారు గర్భవతిగా నిర్ధారణ అయినప్పటి నుంచి బిడ్డపుట్టి రెండు సంవత్సరాలు నిండే వరకు వేయి రోజుల పాటు పిల్లలకు మంచి పౌష్టికాహారం సంరక్షణ పట్ల గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి శ్రీనాథ్ రెడ్డి తాసిల్దార్ శ్రీనివాసులు సిడిపిఓ కోటేశ్వరమ్మ ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ శేషమ్మ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ అంగన్వాడి కార్యకర్తలు టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## విధులకు హాజరుకాని ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీపీ ఆర్.రామాంజినమ్మ

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



మండలం పరిధిలోని శభాష్ పురం గ్రామ సచివాలయం నందు విధులకు హాజరుకాకుండా డుమ్మా కొట్టిన ఉద్యోగులపై చర్యలు తీసుకునే విధంగా జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ ఆర్ రామాంజనమ్మ పేర్కొన్నారు.శనివారం మధ్యాహ్నం శభాష్ పురం సచివాలయాన్ని ఎంపీపీ ఆర్.రామాంజనేయమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీ సమయంలో పలువురు సచివాలయ ఉద్యోగులు వీఆర్వో లక్ష్మి,డిజిటల్ అసిస్టెంట్ శివ నాయక్,వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్ పవన్ కుమార్,మహిళా పోలీస్ వర్షిని లు ఎలాంటి సెలవు పెట్టకుండా విధులకు డుమ్మా కొట్టడంతో వారిపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.ప్రజా సమస్యలు పరిష్కరించవలసిన అధికారులు విధులకు హాజరు కాకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులకు తెలియజేసినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదని, అందువల్ల ఈ విషయంపై స్వయంగా జిల్లా కలెక్టర్లను కలిసి వారిపై చర్యలు తీసుకునే విధంగా ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ ఆర్.రామాంజనమ్మ తెలిపారు. అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున గ్రామసభ జరపకుండా సచివాలయనాకి తాళాలు కూడా వేసినట్లు ఎంపీపీ ఆర్. రామాంజనమ్మ తెలిపారు.ఈ విషయాలన్నీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ రామాంజనమ్మ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరేష్,సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఘనంగా జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశం

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఏప్రిల్ 19:**




ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందికొట్కూరులో పూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా జరిగింది.పూర్వ విద్యార్థుల సంఘ ప్రెసిడెంట్ శ్రీరామ కృష్ణ థియేటర్ యజమాని రామిరెడ్డి నాయకత్వంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునిత అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత మాట్లాడుతూ పూర్వ విద్యార్థులతోనే ఏ కళాశాలైన అభివృద్ధి చెందుతుందని దానికి పరిపూర్ణమైన సహకారం ప్రతి ఒక్క విద్యార్థి అందించాలని కోరారు. సమావేశంలో కళాశాల అభివృద్ధికై చేపట్టవలసిన వివిధ కార్యక్రమాలను గురించి సభ్యులందరూ చర్చించి విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతిరోజు మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయాలని , ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, కళాశాలలోని విద్యార్థులు ఆట్లాడుకునే ప్లే గ్రౌండ్లో సమ్మర్ క్యాంప్స్ నిర్వహించి కబడి, ఖో, ఖో, వాలీబాల్, ఫుట్బాల్ మొదలైన క్రీడలను ఆడిపించాలని నందికొట్కూరు లోని ప్రజలందరికీ ఈ కళాశాలలో రన్నింగ్ ట్రాక్ నిర్వహించి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని తెలియజేశారు. పూర్వ విద్యార్థుల సంఘాన్ని తిరిగి ఇప్పుడున్న సభ్యులతోనే 2025 –2026 సంవత్సరంలో కూడా కొనసాగించాలని నిర్ణయించారు .

నవనంది స్కూలు కరస్పాండెంట్ శ్రీధర్ ప్లే గ్రౌండ్ అభివృద్ధిలో తనకున్న ఎంఓయు ద్వారా అభివృద్ధి చేస్తానని తెలిపారు.శ్రీహరి సర్వోత్తమ రెడ్డి , మీడుతూరు చిట్టిబాబు , కుమార్ గౌడ్ మొదలైన సభ్యులందరూ ఈ సమావేశంలో పాల్గొన్నారు.డాక్టర్ ఎం అన్వర్ హుస్సేన్ డాక్టర్ బి పరిమళాదేవి ఎస్ ఖజా హుస్సేన్ మొదలైన అధ్యాపకులు ఈ సమావేశంలో తమ అభిప్రాయాలను తెలియజేశారు.



## భక్తులతో కిక్కరిసిన మద్దిలేటి స్వామి ఆలయం

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**

: బేతంచర్ల మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన శ్రీ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో చైత్రమాసం శనివారం భక్తులతో కిక్కరిసి పోయింది జిల్లా నాలుగు మూలల నుండి వచ్చిన భక్తులు తరలివచ్చిన భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకం కుంకుమార్చన మహా మంగళహారతి నిర్వహించారు.ఆలయ ఉప కమిషనర్ కారనిర్వాహణాధికారి రామాంజనేయులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ చేశారు.

ఉత్తేజిత దినపత్రిక

# కేంద్రీయ విచారణ కార్యాలయం పునర్వ్యవస్థీకరణపై టీటీడీ ఈవో సమీక్ష

**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 19.**



తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా కేంద్రీయ విచారణ కార్యాలయంలో మెరుగైన వసతులు కల్పించేందుకు టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామల రావు అదనపు ఈఓ శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్ లో కేంద్రీయ విచారణ కార్యాలయం పునర్వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు. తిరుమలలోని కేంద్రీయ విచారణ కార్యాలయం భక్తులకు వసతి, దర్శన టికెట్లు, ఇతర అవసరమైన సేవలను అందించే ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. అయితే గత కొంత కాలంగా, ముఖ్యంగా రద్దీ సమయంలో సీఆర్వోకు అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. ఈ భవనాన్ని చాలా దశాబ్దాల క్రితం నిర్మించడంతో రోజురోజుకీ పెరిగిపోతున్న భక్తుల సంఖ్యత తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు, విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌కు చెందిన ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్ డాక్టర్ జి.కార్తీక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపొందించి సమగ్ర పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను టీటీడీ అధికారులకు వివరించారు. ఈ ప్రజెంటేషన్‌లో భక్తుల రాకపోకలను సులభతరం చేయడం, స్థల వినియోగాన్ని సమర్థవంతంగా చేసుకోవడం, సిఆర్వో, పీఏసీ-1 ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేసి పలు ప్రతిపాదనలను వెల్లడించారు. ఈ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక తిరుమల ఏడుకొండల ఆధ్యాత్మిక మహత్యాన్ని, పర్యావరణానికి అనుగుణమైన నగర ప్రణాళికా సూత్రాలను సమన్వయం చేస్తూ రూపొందించబడింది. ఈ సందర్భంగా ఈఓ శ్రీ శ్యామలరావు మాట్లాడుతూ ప్రత్యేక క్యూ లైన్లు, భక్తులు వేచి ఉండే ప్రాంతాలు, ప్రస్తుత భవనాల పునరుద్ధరణ వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ఈ ప్రణాళిక టీటీడీ దీర్ఘకాలిక మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా కూడా ఉండాలని సూచించారు. ప్రస్తుత రద్దీ పరిస్థితులను చక్కదిద్దడం , కొన్ని దశాబ్దాలుగా ఉన్న భవనాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, అలాగే వచ్చే కొన్ని దశాబ్దాల అవసరాలను దృష్టిలో ఉంచుకోవడం ఈ ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశమని ఈఓ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీటీడీ

చీఫ్ ఇంజినీర్ శ్రీ సత్యనారాయణ, టీటీడీ పట్టణ ప్రణాళిక- డిజైన్ నిపుణులు శ్రీ రాముడు, తిరుమల ఎస్టేట్ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ శ్రీ హరీంద్రనాథ్, వీ జీవోలు శ్రీరాంకుమార్, శ్రీ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగిద్దాం: ఎంపీడీఓ రాణెమ్మ




**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ఏప్రిల్ 19**

సి.బెళగల్ మండలంలో ని ప్రతి గ్రామంలో ఎలక్ట్రాని క్ వ్యర్థాలను సేకరించి, వాటిని శాస్త్రీయంగా తొలగించాలని, ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని సి.బెళగల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఎం.రాణెమ్మ తెలిపారు. శనివారం సి.బెళగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాణెమ్మ మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా, ప్రతినెల ఒకోరకమైన అంశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఇందులో భాగంగానే ఏప్రిల్ నెలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగింపు అంశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి వాటిని వాడకాన్ని నిషేధించాలని, ఇళ్లలో పిల్లలు ఎలక్ట్రాని క్ పరికరాలైన టీవీ, సెల్ ఫోన్ , ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. అనంతరం

ఎలక్ట్రానిక్ వస్తువులను అతిగా వాడడం వల్ల అనర్థాలను తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయం 2 నందు గ్రామసభ నిర్వహించి, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మిథున్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డి ఈశ్వరయ్య స్వామి, ఏపీఎం రమేష్, మండల పరిపాలనాధికారి శ్రీనివాసులు, సర్పంచ్ పాండురంగన్న, పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# భక్తులు వాహనాల నుండి బయటకు చెత్తను విసరడం మానుకోవాలి



స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమంలో టీటీడీ అదనపు శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి

**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 19.**

పవిత్ర పుణ్య క్షేత్రమైన తిరుమలలో భక్తులు తాము ప్రయాణం చేసే వాహనాల నుండి రోడ్లపై చెత్తను విసరడం మానుకోవాలని టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమలలో భాగంగా శనివారం ఉదయం మొదటి ఘాట్ రోడ్ లోని కుంకాల పాయింట్ (ఆఖరి మెట్టు) వద్ద ఆయన సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ వాహనదారులు ప్లాస్టిక్ కవర్లు, తిను బండారాలు, వాటర్ బాటిళ్లను తీసుకొచ్చి రోడ్ల పక్కన విసిరి వేస్తున్నారని చెప్పారు. దీంతో కొంతకాలంగా పెద్ద ఎత్తున చెత్త పోగయ్యిందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమలలో భాగంగా మొదటి ఘాట్ రోడ్డులో ఈ చెత్తను తొలగించాలని నిర్ణయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 400 మంది టీటీడీ సిబ్బందితో పాటు పోలీసులు, తిరుమల స్థానికులు స్వచ్ఛందంగా వచ్చి ఈ కార్యక్రమంలో భాగమయ్యారని చెప్పారు. చెత్తను శుభ్రం చేయడంతో పాటు భవిష్యత్తులో రోడ్డుపై చెత్త విసరకుండా డస్ట్ బిన్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులందరూ ఆ డస్ట్ బిన్ లలో చెత్త వేయాలి తప్పా వాహనంలో ప్రయాణిస్తూ రోడ్డుపై చెత్త విసరడం మంచి పద్ధతి కాదని అన్నారు. తిరుమలను పరిశుభ్రంగా ఉంచేందుకు 6వేల మంది సిబ్బంది నిరంతరాయంగా కృషి చేస్తున్నారని, వారి కృషిని, తిరుమల పవిత్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాల నుండి

బయటకు చెత్త విసరడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని,స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా దిగువ ఘాట్ మార్గంలో ఎనిమిది ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్త తొలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ శ్రీ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో శ్రీ రాజేంద్ర, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ శ్రీ మధుసూదన్, వీజీవోలు శ్రీ సురేంద్ర, శ్రీమతి సదాలక్ష్మీ, ఇతర పోలీసు అధికారులు, పలు శ్రీవారి సేవకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

# బాలికల కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్




**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు ఏప్రిల్ 19 శనివారం ప్రభుత్వ బాలికల కళాశాలలో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు . ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి పి హరి కుమార్ అధ్యక్షతన కళాశాల ప్రిన్సిపాల్ సీ కే విజయరాణి ఆధ్వర్యంలో విధ్యార్థినులు కళాశాల ఆవరణలో ఉన్న చెత్తను ఏరి మొక్కలకు నీరు పోసి స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు . ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపకురాల్లు పద్మావతి , లక్ష్మీ స్రవంతి , కావ్యశ్రీ , అధ్యాపకులు లైబ్రేరియన్ శ్రీనివాసులు , లక్ష్మయ్య , రవి ప్రభాస్ , నాగేష్ అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు .

# రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం: తహసిల్దార్ పురుషోత్తముడు




**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఏప్రిల్ 19**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వే తో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు దగ్గరుండి తమ భూములను సర్వ చేయించుకోవాలని సి.బెళగల్ తహసిల్దార్ పురుషోత్తముడు అన్నారు. శనివారం సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణ దొడ్డి గ్రామంలో రీ సర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ పురుషోత్తముడు మాట్లాడుతూ బ్రాహ్మణ దొడ్డి రెవెన్యూ పరిధిలో రైతులకు భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు ఈ భూ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మే 8వ తేదీ నుండి బ్రాహ్మణ దొడ్డి రెవెన్యూ పరిధిలో భూ సర్వే నిర్వహిస్తామని, రైతులందరూ సర్వే టీములు కొలతలు తీసుకునే రోజు, పొలాలకు ఖచ్చితంగా వెళ్లాలని, సర్వే అధికారులకు తమ దగ్గర ఉన్న డాక్యుమెంట్లను, పట్టాదారు పాసుపుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు,

రిజిస్ట్రేషన్ క్యాంపులు అధికారులకు చూపించాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి భూ సర్వే లేక రైతుల భూములు రికార్డులో నమోదు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరితగతిన సర్వే పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తామని తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ డిప్యూటీ తహసిల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# స్పిన్నింగ్ మిల్ కార్మికుల పెన్షన్ మంజూరు గ్రాజివిటీ కొరకు అర్జీ

**ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి వినతిపత్రం**

అయ్యా నా పేరు భాస్కర్ యాదవ్ తండ్రి పేరు రంగయ్య అను నేను 4/ 27 ఎస్ఎంఎస్ స్ట్రీట్ ఎమ్మినూరు పట్టణం లో నేను 25 ఏళ్ల పాటు స్విమ్మింగ్ కార్మికులుగా పనిచేసినాను స్పిన్నింగ్ మిల్ మూతపడి 15 వేళ్లకు పైబడిన కూడా ఇప్పటివరకు నాతో పాటు 650 పైగా కార్మికులకు ఎటువంటి పెన్షన్ గాని మరియు గ్రజువిటి గారి అందలేదని, స్పిన్నింగ్ మిల్ చైర్మన్ అయినటువంటి పి.నీలకంటప్ప బకాయి పడిన

పెన్షన్ గాని ,మరియు గ్రావిటీ గాని చెల్లించకుండా స్పిన్నింగ్ మిల్ పక్కనున్న ఆస్తులు మరియు నందవరం మండలము గంగవరం గ్రామంలోని కోట్లు విలువ చేసే. స్పిన్నింగ్ మిల్లు ఆస్తులను అమ్ముకుంటున్నారని, కావున మీరు కార్మికులపై దయవుంచి మా యొక్క సమస్యను గుర్తించి స్పిన్నింగ్ మిల్ చైర్మన్ అయినటువంటి నీలప్ప గారి నుండి బకాయి పడిన మా యొక్క పెన్షన్ డబ్బులు మరియు గ్రావిటీ అమౌంట్ ను ఇప్పించాలనికోరుచున్నాము .ఇట్లు కే రామాంజనేయులు ,నాగరాజు, సోమన్న ,రాజు, ఎస్టి నాగరాజు, రవి, శివమూర్తి , రమేషు, తిమ్మప్ప, రామకృష్ణ సోమన్న ,తదితరులుపాల్గొన్నారు.

# టిటిడి గోశాలలో గోవుల గడ్డిని గత పాలకులు వదలలేదు : టిటిడి ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 19.**

టిటిడి గోశాలలో గోవులకు పెట్టే గడ్డిని కూడా గత పాలకులు వదలలేదని టిటిడి ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు మాట్లాడారు. టిటిడి గోశాలలో ఆల్ ఇండియా గోసంరక్షణ సంస్థ ప్రధాన కార్యదర్శి, టిటిడి గోసంరక్షణ పూర్వ సభ్యులు శ్రీ కోటి శ్రీధర్ , టిటిడి బోర్డు సభ్యులు, మీడియాతో కలిసి ఛైర్మన్ శనివారం పరిశీలించారు. ప్రస్తుతం గోవులకు అందుతున్న దాణా, త్రాగునీరు, పరిశుభ్రత, అవసరమైన వైద్యం జరుగుతుందా తదితర అంశాలను గోశాల ఇంఛార్జి డైరెక్టర్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. గోశాలలో గోవులు, పేయ దూడలు ఉంటున్న షెడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టిటిడి గోశాలపై కోర్టుల్లో పిల్స్ దాఖలు చేస్తామని కొంత మంది ఫోన్ లు చేస్తున్నారని, వారిని ఒకటే కోరుతున్నా, గత ఐదేళ్ల పాలనలో టిటిడిలో జరిగిన నిధుల స్వాహా, అవకతవకల అంశాలను జోడించి కోర్టుల్లో కేసులు దాఖలు చేస్తే వారికి పూర్తి సహకారం అందిస్తామని ఛైర్మన్ చెప్పారు . గతంలో పింక్ డైమండ్ మీద కోర్టులో కేసు వేశారని, ఆ కేసు ఏమైందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టిటిడిలో ఎలాంటి అవినీతి జరుగలేదని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు. టిటిడిలో గత 10 నెలల్లో ఏమి జరుగకపోయినా ఏదో జరిగిపోతున్నట్లు కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్న గ్లోబల్ ప్రచారం, డైవర్షన్ పాలిటిక్స్ చేయడం సరికాదని సూచించారు. 2023-24 ఏడాదిలో అప్పట్లో టిటిడి గోసంరక్షణ సలహాదారు శ్రీ కోటి శ్రీధర్ చెప్పిన మాటలను చూస్తుంటే , టిటిడి గోశాలలో జరిగిన అవకతవకలపై మాకు తెలిసింది కొంతే, ఇంకా చాలా ఉందని చెప్పారు. టిటిడి గోశాల గోవులను కూడా ఒంగోలులో అమ్ముకున్నట్లు తెలుస్తోందన్నారు. గతంలో టిటిడి గోశాల సంచాలకులుగా పనిచేసిన డా. హరినాథ్ రెడ్డి టిటిడి గోశాలను సొంత ఎస్టేట్ లాగా భావించి భారీ అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. ఎవరిని గోశాలలోకి రానివ్వకుండా హరినాథ్ రెడ్డి నియంతృత్వంగా వ్యవహరించారన్నారు. వైద్యులను, ఇతరులను గోశాలకు రానివ్వకుండా వేధించారణే ఆరోపణలు ఉన్నాయన్నారు. టిటిడిలో జరిగిన పలు అవకతవకలపై అవసరమైతే ఏసీబీ విచారణ కోరుతామని ఛైర్మన్ మాట్లాడారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డు సభ్యులు శ్రీ జి. భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, టిటిడి గోశాలలో గోవుల సహజ మరణాలపై అసత్య ప్రచారం చేసి, టిటిడి ప్రతిష్టతను పలుచన చేస్తున్న టిటిడి పూర్వ ఛైర్మన్ శ్రీ బి కరుణాకర్ రెడ్డి పై పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టామని, వాటికి సంబంధించిన


పూర్తి వివరాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. చట్టాలనుండి తప్పించుకోలేరని మాట్లాడారు. టిటిడి గోశాలలో గత పాలకుల పాలనలో ఉన్న పూర్వ సంచాలకులు డాక్టర్ శ్రీ హరినాథ్ రెడ్డి పలు అక్రమాలకు పాల్పడ్డారని గతంలో గోశాల సంరక్షణ సభ్యులుగా పనిచేసిన శ్రీ కోటి శ్రీధర్ ఆరోపించారు. మందులు, గడ్డి, ఇతర రాష్ట్రాల నుండి గోవుల కొనుగోలులో భారీగా అవకతవకలు, గోవులు ప్రసవం అయ్యాక గోవులు ఏమయ్యాయో పూర్తి స్థాయిలో లెక్కలు లేవని ఆయన ఆరోపించారు. టిటిడి గోశాలను వివాదం చేయవద్దని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు శ్రీ జి.భానుప్రకాశ్ రెడ్డి, శ్రీ శాంతా రామ్, శ్రీ నరేష్ కుమార్, ఆల్ ఇండియా గోసంరక్షణ జనరల్ సెక్రటరీ శ్రీ కోటి శ్రీధర్ పాల్గొన్నారు.



ఉత్తేజిత దినపత్రిక







# బ్రెస్ట్‌లో కణితులు ఉంటే క్యాన్సర్ వచ్చినట్లేనా..

రొమ్ముల్లో క్యాన్సర్ ఉంటే కణుతులు ఉంటాయి. అయితే, కణుతులన్నీ క్యాన్సర్ అనుకోవచ్చా.. ఇవి ఎందుకొస్తాయి. దీనికి కారణాలు ఏంటో డాక్టర్ సుధా సిన్హా, క్లినికల్ డైరెక్టర్ అండ్ మెడికల్ అంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ అంకాలజీ హెమటాలజీ, కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్ చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలుసుకోండి.

ఫైబ్రోసిస్టిక్ మార్పులు.. హార్మోన్ల మార్పుల వల్ల మన బాడీలో మార్పులు వస్తాయి. వీటి కారణంగా రొమ్ముల్లో గడ్డలు ఏర్పడతాయి. దీనిని ఫైబ్రోసిస్టిక్ మార్పులు అంటారు. హార్మోన్ల మార్పుల వల్ల వచ్చే కణితుల వల్ల క్యాన్సర్స్ రావు. రొమ్ములు హార్మోన్ల మార్పులతో మారుతుంటాయి. ఈ రకమైన రొమ్ము గడ్డలు రొమ్ములోపల ఓ ముద్దలా కనిపిస్తాయి. తాకిన గడ్డలుగా ఉండొచ్చు. రొమ్ము కణితులు ప్రమాదకరం కానప్పటికీ, అవి ఇబ్బందిగా మారతాయి.

ఫైబ్రోడెనోమాస్.. ఇది మరో రొమ్ము కణితి. క్యాన్సర్ లేనిది. ఇవి రొమ్ములోని ముద్దలు. తాకినప్పుడు కదులుతాయి. అవి గుండ్రంగా ఉంటాయి. తాకినప్పుడు మృదువుగా అనిపిస్తాయి. ఈ కణితులు సాదారణంగా యువతుల్లో కనిపిస్తాయి. ముఖ్యంగా 20 ఏళ్ళ బాలికల్లో ఇవి సర్వసాదారణం నొప్పిలేని గడ్డలు కనిపిస్తే డాక్టర్స్‌ని కలవడం ముఖ్యమని గుర్తించండి.

**బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు..**

తిత్తి.. తిత్తి అనేది రొమ్ము కణజాలంలో ద్రవంతో నిండి ఉంటుంది. ఇవి రొమ్ముల్లో గుండ్రంగా, అండాకారంలో ఉంటాయి. చిన్నగా ఉంటాయి. కొంతమందిలో పెద్దగా ఉంటాయి.. పరీయిడ్స్, హార్మోన్ల మార్పుల కారణంగా ఈ తిత్తులు ఏర్పడతాయి. మీకు దీని వల్ల నొప్పిగా ఉంటే మీరు మీ డాక్టర్‌ని కలవొచ్చు. తిత్తి వల్ల ఇబ్బంది ఉంటే డాక్టర్స్ వాటిని పరీక్షించి తొలగిస్తారు.

అడెనోసిస్.. ఇది తల్లిపాలను ఉత్పత్తి చేసే గ్రంథి కుంచించుకుపోయినప్పుడు వస్తుంది. దీని సైజుని పెంచి రొమ్ములో గడ్డలు ఏర్పడేలా చేస్తుంది. అలాగే మంచి కొవ్వు కూడా వస్తుంది. గ్రంధి కణజాలంలో ఈ తేడా ఎప్పుడూ క్యాన్సర్‌కి కారణం కాదు. మీ రొమ్ములు పెద్దగా ఉన్నట్లనిపిస్తే మీరు ట్రీట్‌మెంట్ కోసం డాక్టర్‌ని సంప్రదించొచ్చు. గాయాలు... రొమ్ముపై తాకిన గాయలు రొమ్ములో గడ్డలకి కారణమవుతాయి. గాయపడిన ప్రదేశంలో రక్తం గడ్డ కట్టడం, కణాలతో సమస్యలు వంటివి కారణాలు. ఇలా కనిపిస్తే వెంటనే ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. గడ్డలు కనిపిస్తే.. చాలా మంది రొమ్ముల్లో గడ్డలు కనిపించినప్పుడు బాధపడతారు. డాక్టర్ దగ్గరికి వెళ్ళకముందే క్యాన్సర్ అని భయపడతారు. ఇలాంటివి మానసికంగా బలహీనపరిచి ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. అందుకే, రొమ్ముల్లో గడ్డలని గమనిస్తే వెంటనే డాక్టర్‌ని కలిసి చెకప్ చేసి ట్యూమర్ ఏంటో తెలుసుకుని ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చు.



# నెగెటీవ్ ఎనర్జీ వస్తుంది..



ఇంటిని ఎలా పడితే అలా ఉంచొద్దు. దీని వల్ల కొన్ని నష్టాలు ఉంటాయి. అదే విధంగా, గుమ్మంలో కొన్ని వస్తువులు పెట్టకపోవడమే మంచిది. అవేంటో చూద్దాం. ఇంటి గుమ్మం లక్ష్మీని ఆహ్వానించే భాగమని చెప్పొచ్చు. అందుకే, ఇంటి ముందు భాగమైన గుమ్మాన్ని సరిగ్గా ఉంచాలి. అంతేకాకుండా, కొన్ని వస్తువులు పెట్టకుండా చూసుకోవాలి. లేదా వీటిని పెడితే చాలా నెగెటీవ్ వైబ్రేషన్స్ వస్తాయి. మరి అలా గుమ్మం ముందు పెట్టకూడని వస్తువులు ఏంటో చూద్దాం. ఇంటి గుమ్మం ఎప్పుడు ఎప్పుడు కూడా వెలుగు ఉండాలి. చీకటి అస్సలు ఉండకూడదు. దీని వల్ల నెగెటీవ్ ఎఫెక్ట్ వస్తుంది. ఎక్కువగా వెలుతురు ఉండేలా చూడండి. వీలైతే కొన్ని లైట్స్ పెట్టడం మంచిది. ఇంటి ముందు ముళ్ళు, ముళ్ళ చెట్లని పెట్టకూడదు. కాక్టస్, గులాబీ వంటి వాటిని పెట్టకపోవడం మంచిది. వీటి బదులు పూల మొక్కలు పెట్టొచ్చు. అయితే, గులాబీ మొక్కలు పెట్టకూడదు. వీటిని కూడా గుమ్మానికి ఎదురుగా కాకుండా పక్కన పెట్టాలి. అలానే, సాధారణంగా ఎండిన, వాడిపోయిన మొక్కలు పెట్టకపోవడం మంచిది. దీని వల్ల దురదృష్టం వస్తుంది. ఇంటి గుమ్మంలో, ముందు తలుపు దగ్గర అద్దాలు పెడతారు. ఇది నెగెటీవ్ ఎనర్జీని తీసుకొస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, అద్దాలు, గాజు పదార్థాలు ఉండకుండా ముందు నుంచీ జాగ్రత్తగా ఉండాలి. అదే విధంగా ఇంటికి ఎదురుగా కత్తులు, గొడ్డల్లు, గునపాల వంటివి పెట్టకపోవడమే మంచిది. దీని వల్ల ప్రమాదాలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని స్టోర్ రూమ్‌లో ఓ మూలన పెట్టేస్తే మంచిది.

విరిగిన వస్తువులని ఇంటి ముందు పెట్టడం అంత మంచిది కాదు. దీని వల్ల అశుభం. దీని వల్ల జీవితంలో సమస్యలు వస్తాయని పండితులు చెబుతారు. అయితే, అలా కాకుండా విరిగిన వస్తువులని ఎప్పటికప్పుడు పారేయడమో, పక్కన పెట్టడమో చేయడం మంచిది. అదే విధంగా, చాలా మంది చెప్పులని ఇంటి గుమ్మానికి ఎదురుగా పెడతారు. కానీ, అలా అస్సలు పెట్టకపోవడమే మంచిది. అందుకే గుమ్మానికి పక్కన పెట్టడం మంచిది. ఈ చెప్పులని ఎలా పడితే అలా పారేయకుండా ఓ స్టాండ్ తీసుకుని చక్కగా అమర్చాలి. చెత్తను ఇంటి గుమ్మంలో, తలుపు దగ్గర అస్సలు పెట్టొద్దు. ఇది అంతగా మంచిది కాదు. ఇది నెగెటీవ్ ఎనర్జీని తీసుకొస్తుంది. అందుకే ఇంటి ముందు పెట్టకుండా వెనకాల పెట్టడం మంచిది. అదే విధంగా, చెత్తని కూడా ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం మంచిది.





# మొటిమలు ఇబ్బంది పెడుతున్నాయా..

మొటిమలు..

సౌందర్యపరంగా అమ్మాయిలు, అబ్బాయిలను ఎక్కువగా ఇబ్బందిపెట్టే సమస్య ఇది. కాలుష్యం, శరీరంలో వేడి, అధిక సెబమ్ విడదల కావడం, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపాలు, జన్యుపరమైన సమస్యలు వంటి కారణాల వల్ల మొటిమల సమస్య ఎక్కువగా ఇబ్బందిపెడుతుంది. మొటిమలు, మొటిమల కారణంగా వచ్చే మచ్చలు మిమ్మల్ని అందవిహీనంగా మారుస్తాయి. మొటిమల సమస్యకు చెక్ పెట్టడానికి, చాలా మంది ఎక్స్‌టర్నల్ కేర్ మాత్రమే తీసుకుంటారు. అయితే ఇది మాత్రమే పరిష్కారం కాదు. మొటిమలను మాయం చేయడానికి.. మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ చర్మ సమస్యలను నివారించాలంటే ముందుగా శరీరాన్ని బాగా హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. అదనంగా, రోజువారీ ఆహారంలో కొన్ని పోషకాలను చేర్చుకోవాల్సి ఉంటుంది. ఆ పోషకాలు ఏంటో, ఏయే ఆహారాల్లో ఎక్కువగా ఉంటాయో ఈ స్టోరీలో చూసేయండి. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌లో శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మం మంట, వాపును తగ్గిస్తుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ చర్మంలో సెబమ్ స్రావాన్ని సాఫీగా ఉంచి.. మొటిమలు, ఓపెన్ పోర్స్‌ను నివారిస్తుంది. ఒమేగా - 3 ఫ్యాటీ యాసిడ్స్ చర్మాన్ని హైడ్రేట్‌గా, మృదువుగా ఉంచుతాయి. సాల్మన్, మారికేలా, సార్డినెస్, అవిసె గింజలు, చియా గింజలు, వాల్‌నట్‌లు, ఆలివ్ నూనె, అవకాడోలో ఒమేగా - 3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి.

మీరు మొటిమల సమస్యతో బాధపడుతుంటే.. మీ డైట్‌లో ఒమేగా - 3 ఫ్యాటీ యాసిడ్స్ రిచ్ ఆహారం కచ్చితంగా తీసుకోవాలి. ఈ టిప్‌తో పింపుల్స్ మాయం..! జింక్ రిచ్ ఫుడ్స్.. జింక్ చర్మంలో సెబమ్ ఉత్పత్తిని నియంత్రించి.. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు మొటిమలు, చర్మంపై చికాకు, దురద వంటి చర్మ సమస్యలను తగ్గిస్తాయి. జింక్‌లో గాయాలను నయం చేసే గుణాలు పుష్కలంగా ఉంటాయి. జింక్ చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. గుమ్మడికాయ గింజలు, శనగలు, చిక్కుళ్లు, నట్స్, తృణధాన్యాలు, పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాల్లో జింక్ సమృద్ధిగా ఉంటుంది. వీటిని మన డైట్‌లో చేర్చుకుంటే.. మొటిమలు, చర్మం మంట తగ్గుతుంది. యాంటీఆక్సిడెంట్స్.. యాంటీఆక్సిడెంట్లు మన శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. తద్వారా చర్మానికి నష్టం జరగకుండా, మొటిమలు రాకుండా ఉంటాయి. కెమికల్స్ వల్ల కలిగే ఆక్సికరణ ఒత్తిడి తగ్గించి, వాపులను తగ్గిస్తుంది. విటమిన్ సి పుష్కలంగా ఉండే ఆహారాలలో ఈ యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. సిట్రస్ పండ్లు, స్ట్రాబెర్రీలు, కీవీ పండు, క్యాప్సికమ్, గ్రీన్ టీ, ముదురు ఆకుపచ్చ ఆకు కూరలు, ఆకు కూరల్లో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ప్రో-బయోటిక్స్.. మన గట్ ఆరోగ్యంగా ఉండే.. చర్మమూ ఆరోగ్యంగా ఉంటుంది. గట్‌లోని మంచి బ్యాక్టీరియా, జీర్ణ ఎంజైమ్‌లు బ్యాలెన్స్‌లో లేనప్పుడు వాపు వస్తుంది. ఈ వాపులు మొటిమలు వంటి చర్మ సమస్యలను కూడా ప్రేరేపిస్తాయి. వీటిని నివారించాలంటే ప్రో-బయోటిక్ ఫుడ్స్ తీసుకోవడం చాలా అవసరం. సూక్ష్మపోషకాలను పెంచుతుం, ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది, చర్మ సమస్యలను నివారించవచ్చు. పెరుగు, పచ్చళ్లు, మజ్జిగ, కిమ్చి, ఇతర పులియబెట్టిన ఆహార పదార్థాల్లో ప్రో బయోటిక్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. చర్మం ఆరోగ్యంగా ఉండటానికి, శరీరం హైడ్రేట్‌గా ఉండటే చాలా ముఖ్యం. చర్మం హైడ్రేట్‌గా ఉంటే.. సెబమ్ స్రావం అదుపులో ఉంటుంది. తద్వారా మొటిమలను నివారించవచ్చు. మీ డైట్‌లో నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారం పదార్థాలను ఎక్కువగా తీసుకోండి. కీరా, పుచ్చకాయ, కమల, సెలరీ వంటి ఆహార పదార్థాలను తీసుకోండి. వీటిలో పోషకాలూ సమృద్ధిగా ఉంటాయి.



# రంధ్రాలు పోతాయి..

ముఖంపై రంధ్రాలు ఉంటే వాటిని కనిపించకుండా ఉండేందుకు కొంతమంది మేకప్ కన్సీలర్, ఫౌండేషన్ రాస్తుంటారు. అలాంటివి రాయడం వల్ల ఆ రంధ్రాల్లో ఈ ఫౌండేషన్స్ ఉంటుంది. అది సమస్యని పెద్దగా చేస్తుంది. అలా కాకుండా నేచురల్‌గా రంధ్రాలను తగ్గించేందుకు కొన్ని టిప్స్ వాడాలి. వాటి వల్ల సమస్య తగ్గుతుంది. రంధ్రాలు రావడానికి కారణాలు ఉన్నాయి. వాటిలో కొన్నీ డీహైడ్రేషన్, కెమికల్స్ ఎక్కువగా వాడడం, హార్మోన్స్ ఇన్‌బ్యాలెన్స్, ఒత్తిడి ఆందోళన, పోషకాహార లోపాలు ఇలా చాలా కారణాలు ఉన్నాయి. వీటన్నింటికి ఖరీదైన ట్రీట్‌మెంట్ బదులు కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో చూడండి.

వాడే విధానం.. ముందుగా చెప్పిన పదార్థాలన్నీ ఓ గిన్నెలో వేసి బాగా కలిపి ముఖానికి అప్లై చేసి గుండ్రంగా మసాజ్ చేయాలి. 10 నుంచి 15 నిమిషాల పాటు ఇలా చేయాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో క్లీన్ చేయండి. ఇలా చేయడం వల్ల చర్మ రంధ్రాల్లో ఉన్న మురికి, మృతకణాలు బయటకొస్తాయి. ఇలా వారానికి రెండు, మూడు సార్లు చేస్తే రంధ్రాలు తగ్గుతాయి.





దోసకాయ రసం 4 చెంచాలు, రోజ్ వాటర్ 2 స్పూన్లు. ముందుగా రోజ్ వాటర్, దోసకాయ రసం రెండింటినీ గిన్నెలో బాగా మిక్స్ చేసి ముఖంపై అప్లై చేయండి. 15 నిమిషాల తర్వాత నీటితో ముఖాన్ని క్లీన్ చేయాలి. రెగ్యులర్‌గా ఇలా చేస్తే ముఖంపై ముడతలు తగ్గి రంధ్రాలని కూడా తగ్గిస్తాయి. యవ్వనంగా ఉంటారు. శనగపిండి 1 చెంచా, పసుపు పావు చెంచా, పెరుగు 2 చెంచాలు, ఆలివ్ ఆయిల్ 1 చెంచా, వాడే విధానం..

ముందుగా శనగపిండి, పసుపు, ఆలివ్ ఆయిల్ పెరుగుతో కలిపి ఓ గిన్నెలో మెత్తగా పేస్టులా చేయాలి. మీ ముఖాన్ని చక్కగా క్లీన్ చేసి 20 నిమిషాల పాటు అలానే ఉండి ఆ తర్వాత ముఖాన్ని మృదువుగా మసాజ్ చేయాలి. తర్వాత చల్లని నీటితో క్లీన్ చేయాలి. శనగపిండి చర్మ రంధ్రాల్లో మలినాలని తొలగిస్తుంది. పసుపులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు చర్మంపై బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లని దూరం చేస్తాయి. ఆలివ్ ఆయిల్ చర్మాన్ని మృదువుగా, రంధ్రాలను తగ్గిస్తుంది.

ముందుగా పెరుగులో శనగపిండి కలిపి 15 నిమిషాల పాటు అలానే ఉంచండి. తర్వాత నెమ్మదిగా నీరు చల్లి వేళ్ళతో మృదువుగా మసాజ్ చేసి క్లీన్ చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు మాత్రమే చేయాలి.

# పేలను తరిమి కొట్టేయండి

స్కూల్, కాలేజీ పిల్లలు ఎదుర్కొనే పెద్ద సమస్య పేలు. ఎక్కడ్నుంచి వస్తాయోగానీ పిల్లల తలల్లోకి కుప్పలుగా పేలు చేరతాయి. పేలు కారణంగా విపరీతమైన దురద ఇబ్బందిపెడుతుంది. దీంతో హెయిర్ ఫాల్ సమస్య కూడా ఎక్కువవుతుంది. పేలను వెతికి తీయడం అమ్మలకు పెద్ద సమస్యే. ఇవి ఒక పట్టాన వదలవు. పేల దువ్వెనతో దువ్వినప్పుడు కాస్త తగ్గుతాయి కానీ, వాటి గుడ్లు మళ్లీ కొన్ని రోజులకే పేలుగా మారతాయి. పేల సమస్యను నివారించడానికి మార్కెట్‌లో షాంపూలు, ఆయిల్స్ ఉన్నా.. వాటి కారణంగా దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంది. పేల సమస్యను చెక్ పెట్టడానికి సులభమైన ఇంటి చిట్కాలు సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

ఈ నూనెతో చెక్ పెట్టండి..

పావు లీటరు కొబ్బరి నూనె, కప్పు వేప గింజలు తీసుకోవాలి. కొబ్బరినూనెను సన్నని సెగపై 20 నిమిషాలు వేడి చేయాలి. ఆ తర్వాత పొయ్యి మీద నుంచి దించి.. నూనె వేడిగా ఉన్నప్పుడే వేప గింజలు వేసి వారం రోజుల పాటు కదపకుండా అలాగే ఉంచాలి. ఆ తర్వాత దాన్ని తలకు అప్లై చేసుకొని గంట తర్వాత తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుండాలి. ఇలా చేస్తే.. నాలుగు నుంచి ఐదు వారాల్లోనే తలలో పేలు తగ్గుతాయి. ఈ నూనెను ఒకసారి తయారుచేసుకుంటే ఆరు నెలల వరకు ఉపయోగించుకోవచ్చు. వేప గింజలను నూనెలో అలాగే ఉంచాలే తప్ప వడకట్టకూడదు. యాపిల్ సైడర్ వెనిగర్ పేల సమస్యకు ఎఫెక్టివ్ చెక్ పెడుతుంది. అరకప్పు యాపిల్ సిడార్ వెనిగర్‌లో రెండు కప్పుల నీళ్లు కలిపి జుట్టుకు పట్టించండి. పదినిమిషాల తర్వాత దువ్వండి. ఇలా చేస్తే.. పేలు బయటకు వచ్చేస్తాయి. ఇలా వారానికి రెండు మూడుసార్లు చేస్తే మంచి రిజల్ట్స్ ఉంటాయి.



పేలను తరిమికొట్టడానికి వెల్లుల్లి అద్భుతంగా పని చేస్తుంది. ముందుగా కొన్ని వెల్లుల్లి రెబ్బలను మెత్తగా నూరి, దానికి కాస్త నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి మునివేళ్లతో సున్నితంగా మర్ధన చేయాలి. దీన్ని అరగంట సేపు ఉంచి.. గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయండి. ఆ తర్వాత చిక్కుదువ్వెనతో దువ్వాలి. అప్పుడు పేలు మొత్తం రాలిపోతాయి. వేపాకు మెత్తగా నూరి.. అందులోకి రెండుచుక్కలు ఆలివ్ ఆయిల్ కలిపి.. జుట్టు కుదుళ్లకు పట్టించాలి. గంట తర్వాత స్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే.. పేలు మాయం అవుతాయి. బాదం, కొబ్బరి నూనెను డబుల్ బాయిలర్ మెథడ్ లో వేడి చేయండి. గోరువెచ్చని నీళ్లతో.. తలకు పట్టించి పొద్దున్నే తలస్నానం చేసి, దువ్వెనతో దువ్వాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తుండడం వల్ల తలలో పేలు చేరకుండా ఉండడమే కాకుండా, జుట్టుకు మెరుపు వస్తుంది. జుట్టు కుదుళ్లు బలంగా ఉంటాయి. ఆలివ్‌నూనె.. ఇది జుట్టుకి పోషణ అందించడమే కాదు, పేల సమస్యకీ పరిష్కారం చూపిస్తుంది. ఆలివ్ నూనెని తలకు బాగా పట్టించి... కాసేపయ్యాక దువ్వి చూడండి. ఇలా వారానికి మూడు సార్లుచేస్తే.. పేలు మాయం అవుతాయి.



# కాళ్ల పగుళ్లు ఎందుకొస్తాయో తెలుసా..?

కాళ్ల పగుళ్లను దాచుకుంటున్నారా.. ఇది మీ సమస్యకు పరిష్కారం అనుకుంటున్నారా.. ఒకవేళ మీ సమాధానం అవును అంటే.. మీ తప్పు చేస్తున్నట్లే. పగిలిన పాదాలను ఎదుటివారికి కనపడకుండా దాచుకోవడం కంటే.. ఆ సమస్యకు పరిష్కారం కనుక్కోవడం చాలా ముఖ్యం. కొందరిలో కాళ్లమీద పగుళ్లు చాలా లోతుగా ఏర్పడి నొప్పిని కలిగిస్తుంటాయి. మరీ ముఖ్యంగా మడమల మీద ఈ పగుళ్లు ఎక్కువగా ఏర్పడుతుంటాయి. అసలు కాళ్ల పగుళ్లు ఏర్పడటానికి కారణాలు ఏమిటి, వీటిని ఎలా నివారించాలో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి.

చర్మం పొడిబారితే.. చర్మం పొడిబారితే..

పొడి చర్మం కారణంగా కాళ్ల పగుళ్లు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. పాదాల చర్మం పొడిగా ఉంటే.. స్థితిస్థాపకత, వశ్యతను కోల్పోతుంది, చివరికి మడమల పగుళ్లకు దారితీస్తుంది.





తరచుగా ఓపెన్ బ్యాక్, హై హీల్స్ ధరించే మహిళలకు పాదాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. పాదాలపై స్ట్రెస్ పెరిగితే.. కాళ్ల పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. పాదల పగుళ్లను నివారించానికి, సౌకర్యంగా ఉండే చెప్పులు వేసుకోవడం మేలు.

వయసు పెరిగే కొద్దీ చర్మం తేమతోపాటు స్థితిస్థాపకతను కోల్పోతుంది. దీని వల్ల మీ ముఖం, మెడ మాత్రమే కాదు.. మీ మడమలు కూడా ఎఫెక్ట్ అవుతాయి. దీని కారణంగా కాళ్ల పగుళ్లు ఏర్పాడతాయి.?

తేమ లేకపోతే.. మీ పాదాలను మాయిశ్చరైజ్ చేయకపోతే.. పొడిగా మారతాయి, పగుళ్లు ఏర్పడతాయి. ముఖ్యంగా స్నానం చేసిన తర్వత.

మీరు ఎక్కువసేపు నిలబడినా, నడిచినా పాదాలపై ఒత్తిడి పెరుగుతుంది. దీని కారణంగా కాళ్ల పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది.



కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగానూ కాళ్ల పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. డయా బెటిస్, థైరాయిడ్ సమస్యలు, సోరియాసిస్ వంటి సమస్యలు ఉన్న వ్యక్తులకు పాదాల పగుళ్లు ఎక్కువగా ఏర్పడే అవకాశం ఉంది.

మీ పాదాలను శుభ్రంగా ఉంచుకోండి.పాదాల పగుళ్లను నివారించడానికి.. మీ కాళ్లను గోరువెచ్చటి నీటిలో కాస్తంత ఉప్పు వేసి కాళ్లను కొన్ని నిమిషాల పాటు అలాగే ఉంచి, శుభ్రంగా కడుక్కోవాలి. అనంతరం పొడిక్లాత్‌తో తడి లేకుండా తుడవాలి. రాత్రి పడుకునేముందు పాదాల పగుళ్లకు వెన్న లేదా వ్యాజిలిన్ రాస్తే



మృదువుగా అవుతాయి. రాత్రి పడుకునేముందు పాదాల పగుళ్ల పక్కబట్టలకు అంటకుండా సాక్స్ లేదా పాత దుప్పటి వేసుకోవచ్చు. తేనె మంచి యాంటీసెప్టిక్. తేనెలో నిమ్మరసం కలిపి పాదాలకు రాయడం వల్ల మంచి రిజల్ట్స్ ఉంటాయి. రాత్రి కొబ్బరినూనెను రాసి ఉదయం రుద్ది కడగాలి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీమైక్రోబియల్ గుణాలు పగుళ్లను తగ్గిస్తాయి. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధిం చిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.



# కారులో పిల్లలను లాక్ చేసి..

**తిరుమల:** తిరుమలలో ట్రాఫిక్ పోలీసుల సమయస్ఫూర్తి తో వ్యవహరించి ఇద్దరు చిన్నారుల ప్రాణాలు కాపాడారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం బద్వేలుకు చెందిన ఓ కుటుంబం తిరుమలకు వచ్చింది. అయితే చిన్నారుల పెదనాన్న వారిని కారులో ఉంచి.. దర్శనం గురించి సమాచారం తెలుసుకునేందుకు బయటకు వెళ్లారు. అయితే డోర్లు లాక్ చేయటంతో ఊపిరాడక పిల్లలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే అక్కడే ఉన్న ట్యాక్సీ డ్రైవర్లు విషయాన్ని ట్రాఫిక్ పోలీసులకు తెలియజేయగా.. వారు ఘటనాస్థలికి చేరుకుని పిల్లలను కాపాడారు.

పోలీసుల సమయస్ఫూర్తి ఇద్దరు చిన్నారుల ప్రాణాలు నిలిపింది. ఈ ఘటన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు నెలవైన తిరుమలలో చోటుచేసుకుంది. కారులో ఊపిరాడక ఇబ్బందులు పడుతున్న ఇద్దరు చిన్నారులను తిరుమల ట్రాఫిక్ పోలీసులు రక్షించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వారి ప్రాణాలను కాపాడిన పోలీసులు.. అనంతరం వారి తల్లికి క్షేమంగా అప్పగించారు. తిరుమల పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేలుకు చెందిన ఓ కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చింది. వెంకటసుబ్బారెడ్డి, సుమలత అనే దంపతులకు ఏడేళ్ల భాను, నాలుగేళ్ల నీల సంతానం. సుమలత తన పిల్లలతో కలిసి తిరుమలకు వచ్చారు. వీరితో పాటుగా వెంకటసుబ్బారెడ్డి అన్న గంగయ్య, అతని భార్య, అల్లుడు కూడా శ్రీవారి దర్శనం కోసం వచ్చారు.

వీరంతా ఓ కారులో గురువారం తిరుమలకు బయల్దేరారు. తిరుపతిలోని అలిపిరికి వద్దకు చేరుకున్న తర్వాత సుమలత, గంగయ్య భార్య మెట్ల మార్గంలో తిరుమలకు బయల్దేరారు. గంగయ్య, అతని అల్లుడు, ఇద్దరు పిల్లలతో పాటుగా కారులో తిరుమలకు బయల్దేరారు. తిరుమల చేరుకున్న తర్వాత వరాహస్వామి గెస్ట్ హౌస్-1 పార్కింగ్ ఏరియాలో తమ కారును పార్క్ చేశారు. అయితే ఇక్కడే గంగయ్య, అతని అల్లుడు పొరబాటు చేశారు. దర్శనం కోసం ఎలా వెళ్లాలో తెలుసుకునేందుకు గంగయ్య, అతని అల్లుడు.. ఇద్దరు పిల్లలను కారులోనే ఉంచి డోర్లు లాక్ చేసుకుని బయటకు వెళ్లారు. అయితే కారు అద్దాలు మూసివేసి ఉండటంతో పిల్లలకు ఊపిరి తీసుకోవడం కష్టమైంది. ఊపిరాడక ఇద్దరు పిల్లలు గట్టిగా ఏడవడం మొదలెట్టారు.

**తిరుమల కారులో మంటలు...**

పిల్లల ఏడుపులు పక్కనే ఉన్న ట్యాక్సీ డ్రైవర్లకు వినిపించాయి. దీంతో వీరు ఆ విషయాన్ని తిరుమల ట్రాఫిక్ పోలీసులకు చేరవేశారు. దీంతో తిరుమల ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని.. పిల్లలను కాపాడారు. కారు అద్దాన్ని పగలగొట్టి ఇద్దరు చిన్నారులను బయటకు తీసుకువచ్చారు. అనంతరం తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రికి ఇద్దరు చిన్నారులను తరలించారు. అశ్వినీ ఆస్పత్రిలో చికిత్స అందించిన అనంతరం చిన్నారులను స్థానిక హోంగార్డులు.. తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత దీనికి కారణమైన చిన్నారుల పెదనాన్న గంగయ్యపై ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత చిన్నారులను వారి తల్లి సుమలతకు పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా తన పిల్లలను రక్షించిన పోలీసులకు సుమలత ధన్యవాదాలు తెలియజేశారు.

## టీటీడీ ఈవో బంగ్లాలో దూరిన నాగుపాము..

# పట్టుకుని సంచిలో వేస్తుండగా..



**తిరుపతి:** టీటీడీ ఈవో జే శ్యామలరావు బంగ్లాలో గురువారం రాత్రి భారీ నాగుపాము కలకలం సృష్టించింది. బంగ్లా సిబ్బంది వెంటనే రిటైర్డ్ ఉద్యోగి రవీందర్ నాయుడుకు సమాచారం ఇవ్వగా, ఆయన పామును పట్టుకునే ప్రయత్నంలో పాము కాటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ను స్విమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు అంటున్నారు.

తిరుపతిలో టీటీడీ ఈవో జే శ్యామలరావు బంగ్లాలో నాగుపాము కలకలం రేపింది. గురువారం రాత్రి ఓ భారీ నాగుపాము లోపలికి దూరింది.. వెంటనే అప్రమత్తమైన బంగ్లా సిబ్బంది వెంటనే పామును పట్టేందుకు టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి రవీందర్ నాయుడుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే టీటీడీ ఈవో బంగ్లాకు వచ్చారు.. చాకచక్యంగా పామును పట్టుకుని గోనె సంచెలో వేస్తుండగా.. ఆ పాము రవీందర్ నాయుడు చేతిపై కాటు వేసింది. వెంటనే అక్కడే ఉన్న సిబ్బంది ఆయన్ను తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ప్రస్తుతం రవీందర్ నాయుడు ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు చెబుతున్నారు. గతంలో కూడా టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి భాస్కర్ నాయుడు పామును పట్టుకునే ప్రయత్నం చేయగా కాటు వేసింది. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా మారగా.. ప్రభుత్వం, టీటీడీ సూచనతో మెరుగైన వైద్యం అందించడంతో కోలుకున్నారు. అయితే ఈ ఘటన తర్వాత భాస్కర్ నాయుడు మళ్లీ ఉద్యోగంలో కొనసాగుతున్నారు. ఇప్పుడు మరో రిటైర్డ్ ఉద్యోగి రవీంద్ర నాయుడిని నాగుపాము కాటు వేసింది.

# విశాఖ నుంచి తరలింపు.. 516 ఎకరాలు, ఎకరా 27 లక్షలు..

**విజయనగరం:** విజయనగరం జిల్లాలో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో తొలుత దీనిని ఏర్పాటు చేయాలని భావించారు. అయితే ఆ తర్వాత విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 516 ఎకరాలు కేటాయిస్తూ ఏపీ రెవెన్యూశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. విజయనగరం జిల్లాలో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది. కొత్తవలస మండలం రెల్లి గ్రామంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఈ గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 516.58 ఎకరాల భూమి కేటాయించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం భూ కేటాయింపులపై విజయనగరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనల్ను పంపించారు.

ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీలో చర్చించారు. అనంతరం ఎకరానికి రూ.27 లక్షల చొప్పున భూమిని కేటాయించాలని నిర్ణయించారు. రూ.139.47 కోట్లకు భూమిని కేటాయించాలని ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీలో తీర్మానించారు. దీనికి రెవెన్యూ శాఖ ఆమోదం తెలిపింది.

మరోవైపు రెల్లిలో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం కేటాయించిన 516 ఎకరాల భూమిలో.. 337.45 ఎకరాలు ప్రభుత్వ భూమి. మిగతా 179.13 ఎకరాలు ప్రజల నుంచి సేకరించాల్సి ఉంది. ఇందుకోసం ఆ రైతులకు మరో చోట భూములు కేటాయిస్తామని విజయనగరం కలెక్టర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నివేదించారు. ప్రజల నుంచి సేకరించాల్సిన భూమిలోనే 5.34 ఎకరాలకు పరిహారంగా రూ.1.44 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరోవైపు గ్రేహౌండ్స్ శిక్షణ



కేంద్రం కోసం గతంలో విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం జగన్నాథపురంలో భూమి కేటాయించారు. ఆ తర్వాత ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. తాజాగా విజయనగరం జిల్లాలో ఈ భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా పోలీసు సిబ్బందికి నక్సలైట్లు , తీవ్రవాద కార్యకలాపాలను ఎదుర్కొనేందుకు అవసరమైన ఉన్నత స్థాయి శిక్షణను అందిస్తారు. గ్రేహౌండ్స్ ఫోర్స్ జంగిల్ వార్‌ఫేర్, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, ఆయుధ నిర్వహణ, శారీరక దృఢత్వంపై దృష్టి సారిస్తారు. జంగిల్ వార్‌ఫేర్ అంటే అడవి ప్రాంతాల్లో యుద్ధం నిర్వహించడంపై ట్రైనింగ్ ఉంటుంది. అడవిలో మాటువేసి దాడి చేయడం వంటి వాటిపై ట్రైనింగ్ నిర్వహిస్తారు. ఇక గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా ఆధునిక ఆయుధాల వినియోగం, నిర్వహణపై శిక్షణ అందిస్తారు. గెరిల్లా దాడులు, ఆకస్మిక దాడులను ఎదుర్కోవడం ఎలా దానిపైనా ట్రైనింగ్ ఇస్తారు. ఎక్కువ కాలం కఠిన పరిస్థితుల్లో పనిచేయడానికి అవసరమైన దృఢత్వం, ఓర్పు ఉండేలా గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ ఇస్తారు.

# దేవుడి పేరుతో ఇలానా.. నారా లోకేష్ రియాక్షన్




**ఏపీ:** దేవుడి పేరుతో బెట్టింగ్ యాప్ నిర్వహి స్తున్నారంటూ యూట్యూబర్ నా అన్వేష్.. ఏపీ మంత్రులు పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లకు ఫిర్యాదు చేశారు. గోవిందా బెట్టింగ్ యాప్ పేరుతో బెట్టింగ్ యాప్ నిర్వహిస్తున్నారని.. దీనిని సెలబ్రిటీలు ప్రమోట్ చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ నా అన్వేషణ అన్వేష్ ఇటీవల వీడియో విడుదల చేశారు. దీనికి ఏపీ మంత్రి నారా లోకేష్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌ల కారణంగా జీవితాలు బలౌతున్నాయన్న నారా లోకేష్.. దేశానికే ఆదర్శంగా నిలిచేలా యాంటీ బెట్టింగ్ పాలసీ తెస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ ఎంత కలకలం రేపాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. యూట్యూబర్ నా అన్వేషణ అన్వేష్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చొరవతో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలకు పోలీసుల నుంచి నోటీసులు వెళ్లాయి. కొంతమంది విచారణకు కూడా హాజరయ్యారు. ఇక బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన వారు.. తమ సోషల్ మీడియా ఖాతాలలో సారీలు చెప్తూ, ఇలాంటి వాటికి బానిసలుగా మారొద్దంటూ వీడియోలు కూడా షేర్ చేసిన పరిస్థితి. అయితే భక్తి పేరుతో బెట్టింగ్ యాప్ నిర్వహిస్తున్న వైనం తాజాగా వెలుగుచూసింది. ఈ విషయాన్ని యూట్యూబర్ నా అన్వేష్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఓ వీడియో షేర్ చేయగా.. మంత్రి నారా లోకేష్ స్పందించారు.

పవిత్రమైన వెంకటేశ్వర స్వామి పేరుతో గోవిందా అనే బెట్టింగ్ యాప్‌ను కొన్నేళ్లుగా సినీతారలు నడుపుతున్నారని నా అన్వేష్ ఇందులో ఆరోపించారు. చాలామంది ప్రముఖులు, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వెబ్‌సైట్లలో ఈరోజు 16-4-2025 వరకు దీనిని నడిపిస్తున్నారని నా అన్వేష్ ఇటీవల ట్వీట్ చేశారు. అమాయకమైన యువతను వీటి నుండి కాపాడాల్సిందిగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నానంటూ వీడియో విడుదల చేశారు. ఈ బెట్టింగ్ యాప్‌లో ఎంత గెలిచినా టాక్స్ ఉండద ని.. సినీ తారలు, సెలబ్రిటీలు దీనిని ప్రమోట్ చేస్తున్నారని ఆరోపించారు. దేవుడి పేరుతో ఇలాంటి పనులు చేస్తున్నారని.. సనాతన ధర్మం కోసం పోరాడే వారు ఈ గోవిందా బెట్టింగ్ యాప్ మీద చర్యలు తీసుకోవాలని నా అన్వేష్ కోరారు.

మరోవైపు నా అన్వేష్ వీడియో, ట్వీట్‌పై మంత్రి నారా లోకేష్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌లు జీవితాలను నాశనం చేస్తున్నాయని నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. జూదానికి బానిసైన యువత నిరాశలో కూరుకుపోయిన వందలాది హృదయ విదారక కథలను వింటున్నానని నారా లోకేష్ ట్వీట్ చేశారు. దీనిని ఇకనైనా ఆపాలన్న నారా లోకేష్.. ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం దీనిపై అవగాహన కల్పించడం.. బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరించడమేనని అన్నారు. మొత్తం దేశానికే ఒక ఉదాహరణగా నిలిచేలా యాంటీ బెట్టింగ్ పాలసీ తెచ్చేందుకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ముప్పును అంతం చేయడానికి అన్ని చట్టపరమైన మార్గాలను అన్వేషిస్తామంటూ నారా లోకేష్ బదులిచ్చారు.

# ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

**ఏపీ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా ఉద్యోగుల కు చంద్రబాబు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రసూతి సెలవులను కూడా ప్రొబేషన్ ప్రకటనకు పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఎంతమంది పిల్లలకైనా ప్రసూతి సెలవులు ఇస్తామని, ఉద్యోగుల ప్రయోజనాలకు ఎలాంటి ఆటంకం ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మే 8న జరగబోయే ఏపీ మంత్రివర్గ సమావేశంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. మహిళా ఉద్యోగుల ప్రొబేషన్ ప్రకటనకు ప్రసూతి సెలవులను లెక్కించేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారు ప్రసూతి సెలవులు తీసుకున్నా ప్రొబేషన్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రభుత్వం తెలిపింది. ఈ సెలవులను లెక్కలోకి తీసుకొని ప్రొబేషన్ ప్రకటిస్తారన్న మాట. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా మహిళా దినోత్సవం రోజున ప్రకాశం జిల్లా మార్కాపురంలో ప్రసూతి సెలవుల అంశంపై క్లారిటీ ఇచ్చారు.

రాష్ట్రంలో ఇకపై ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఎన్ని కాన్పులైనా ప్రసూతి సెలవులు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గతంలో తానే జనాభా నియంత్రణ పాటించాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన ముఖ్యమంత్రి.. అయితే భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్రంలో జనాభా పెరగాల్సిన అవసరం ఉందని తానే ఇప్పుడు చెబుతున్నానన్నారు. 'ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు ఇద్దరి వరకే ప్రసూతి సెలవులి స్తున్నాం. ఇకపై ఎంత మంది పిల్లలకైనా ప్రసూతి సెలవులు ఇస్తాం. ఇతర ప్రయోజనాలనూ కల్పిస్తాం' అన్నారు. అందుకే ఎంత మంది పిల్లలను కన్నా సరే ప్రభుత్వ మహిళా ఉద్యోగుల ప్రయోజనాలకు ఇబ్బంది కలగకుండా చూస్తానన్నారు. దేశం కోసం గతంలో అలా చెప్పాల్సి వచ్చింది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. పిల్లలను కనాలని చెబుతున్నాను.

మే 8న ఏపీ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో భేటీ నిర్వహిస్తారు. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను శాఖల వారీగా మే 6 లోపు సాధారణ పరిపాలనశాఖలో అందజేయాలని సీఎస్ కె.విజయానంద్ ఆదేశించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.. ఈ కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి, మంత్రులు పలు కీలక అంశాలపై



చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

ఆవిడ కోసం చీరలు కొన్న సీఎం చంద్రబాబు.. భువనేశ్వరి రియాక్షన్ ఇదే

మరోవైపు రాష్ట్రంలోని ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్(క్లాస్-2)ల గౌరవ వేతనాన్ని రూ.30వేల నుంచి రూ.45వేలకు పెంచుతున్నట్టు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. రవాణా ఖర్చుల కింద అదనంగా రూ.5వేలు చెల్లించనున్నట్టు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గౌరవవేతనం పెంపు 2019 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని వెల్లడించారు. గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి గ్రామంలో 516.58 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖకు కేటాయించింది. ఎకరా రూ.27 లక్షల చొప్పున మొత్తం రూ.139.47 కోట్ల ధరకు ఈ భూమి ఇచ్చింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆ ఖైదీలందరికి శుభవార్త.. త్వరలోనే జైలు నుంచి విడుదల

**ఏపీ:** ఆంధ్రప్రదేశ్ జైళ్లలో మగ్గుతున్న జీవిత ఖైదీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి శిక్షా కాలాన్ని తగ్గించి, ముందస్తుగా విడుదల చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించింది. అర్హులైన ఖైదీలను విడుదల చేయడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయం ఖైదీల జీవితాల్లో వెలుగులు నింపుతుందా, లేదా అనేది వేచి చూడాలి.

ఆంధ్రప్రదేశ్‌లోని జైళ్లలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ మేరకు వారి శిక్షను తగ్గించి, ముందుగానే విడుదల చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది.. ఓ కమిటీని నియమించింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల జాబితాను సిద్ధం చేయాలని జైళ్ల శాఖ డీజీని ఆదేశించింది. అర్హులైన ఖైదీలను ఏటా ఫిబ్రవరి, జూన్, అక్టోబరు 1వ తేదీల్లో విడుదల చేయనున్నారు. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఖైదీకి సంబంధించిన కేసులు, శిక్ష, ఇతరత్రా నిబంధనలకు అనుగుణంగా



కమిటీ నిర్ణయం తీసుకుంటుంది.

ముందుగా అర్హులైన ఖైదీల జాబితాను జైళ్ల శాఖ డీజీ ప్రభుత్వానికి పంపిస్తారు.. ఆ తర్వాత హోంశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ ఆ జాబితాను పరిశీలిస్తుంది. ఈ కమిటీలో న్యాయశాఖ కార్యదర్శి, డీజీపీ, సీఐడీ ప్రధాన న్యాయ సలహాదారు, నిఘా విభాగాధిపతి, జైళ్ల శాఖ డీజీ సభ్యులుగా ఉంటారు. ప్రతి ఖైదీకి సంబంధించిన కేసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనర్హులను తొలగిస్తారు. ముందుస్తు విడుదల పొందిన ఖైదీలు రూ.50 వేలకు వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలి. అలాగే ఆయా ఖైదీలు వారి శిక్షాకాలం పూర్తయ్యే వరకూ స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి వద్ద ప్రతి 3నెలలకు ఒకసారి హాజరవ్వాల్సి ఉంటుంది. విడుదలైన తర్వాత వారు మళ్లీ నేరం చేసినా, అరెస్టైనా వారి క్షమాభిక్ష రద్దు అవుతుంది. విడుదలైన ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని.. లేదంటే మళ్లీ జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరిం చారు. చాలా ఏళ్లుగా ఖైదీల విడుదల ప్రక్రియ ఆగిపోయింది.. దీంతో ఏపీ ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాల ను జారీ చేసింది. విజయనగరం లోని ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు కమాండెంట్ ఎం. వెంకటేశ్వరరావును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన ప్రస్తుతం బెటాలియన్స్ ప్రధాన కార్యాలయంలో ఉండగా.. అదనపు కమాండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.



## తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్..

# జులై నెల కోటా విడుదల..

**తిరుమల:** తిరుమల శ్రీవారి భక్తులకు ముఖ్య గమనిక. జులై నెలకు సంబంధించిన శ్రీవారి దర్శనం, వసతి గదుల ఆన్‌లైన్ కోటా టికెట్లను టీటీడీ విడుదల చేయనుంది. తిరుమల శ్రీవారి సుప్రభాతం, తోమాల, అర్చన,అష్టదళ పాదపద్మారాధన సేవల జులై నెల కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ఈ సేవా టికెట్ల లక్కీ డిప్ రిజిస్ట్రేషన్ కోసం రేపు ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది. లక్కీ డిప్ ద్వారా ఈ టికెట్లు పొందిన భక్తులకు.. డబ్బులు చెల్లించి టికెట్లు పొందేందుకు 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ సమయం ఉంది. ఏప్రిల్ 21 నుంచి సొమ్ము చెల్లించవచ్చు.

మరోవైపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను జులై 22న విడుదల చేయనున్నారు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను 22 ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే తిరుమల శ్రీవారి వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను 22 మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. జులై నెల అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. ఇక తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి జులై నెల శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటాను 23వ తేదీ ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారు.

ఇక తిరుమలలో వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి కేటాయించే జులైన నెల ఉచిత ప్రత్యేక దర్శనం టికెట్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. అలాగే జులై నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కోటాను ఏప్రిల్ 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో జూలై నెల గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టీటీడీ ఓ ప్రకటనలో కోరింది. అలాగే తిరుమల ఆన్‌లైన్ టికెట్లను https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.

# చిన్న పొరపాటుతో రూ.లక్ష కట్..

**ఏపీ:** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కార్యకర్త చెన్నుకు పొరపాటున లక్ష రూపాయలు కట్ అయ్యాయి. చెన్ను విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన లోకేష్, చెన్ను ఖాతాకు రూ.99,900 తిరిగి జమ చేయాలని ఆదేశించారు. తెలుగు దేశం పార్టీ సభ్యత్వాల నమోదు చేసిన సంగతి తెలిసిందే.. ఏకంగా రూ.కోటికిపైగా సభ్యత్వాలు నమోదయ్యాయి. టీడీపీ సరికొత్తగా రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల చొప్పున బీమాను కూడా చేస్తోంది. అయితే సభ్యత్వం తీసుకునే క్రమంలో ఓ తెలుగు దేశం పార్టీ కార్యకర్త సభ్యత్వం తీసుకునే సమయంలో చిన్న పొరపాటు జరిగి.. అకౌంట్ నుంచి డబ్బులు కట్ అయ్యాయి. అయితే ఈ విషయం విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు తెలియడంతో వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడికి చెందిన టీడీపీ కార్యకర్త యేడ్లూరి చెన్ను.. డిసెంబర్ 6న టీడీపీ సాధారణ సభ్యత్వం కోసం ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేశారు.. అయితే తెలుగు దేశం పార్టీ సాధారణ సభ్యత్వానికి రూ.100 చెల్లించాల్సి ఉండగా.. పొరపాటున చెన్ను బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.1 లక్ష కట్ అయ్యాయి. తెలుగు దేశం పార్టీ ఆఫీస్ సిబ్బంది పొరపాటున.. చెన్ను టీడీపీ శాశ్వత సభ్యత్వం (టీడీపీ శాసనసభ్యత్వం రూ. లక్షగా నిర్ణయించారు) అనుకుని అంత డబ్బు తీసుకున్నారు. ఈ సమస్య గురించి టీడీపీ కార్యకర్త చెన్ను జనవరిలో మంత్రి లోకేష్ చెప్పారు. పొరపాటున జరిగిందని.. తనకు డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి లోకేష్.. టీడీపీకి సంబంధించిన ఫైల్స్‌ను పరిశీలించాలని అక్కడి సిబ్బందికి సూచించారు.. ఆ తర్వాత రూ.100 తీసుకుని.. మిగిలిన రూ.99,900లను తిరిగి టీడీపీ కార్యకర్త చెన్ను బ్యాంక్ అకౌంట్‌కు జమ చేయాలని టీడీపీ ఆఫీస్ సిబ్బందిని ఆదేశించారు. తాజాగా ఎట్టకేలకు ఆ డబ్బులు చెన్ను బ్యాంక్ అకౌంట్‌లో జమ అయ్యాయి. తన డబ్బులు తిరిగి రావడంతో చెన్ను సంతోషం వ్యక్తం చేశారు.. తనకు సాయం చేసిన లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లోకేశ్ చొరవతో సమస్య పరిష్కారమైందన్నారు చెన్ను. టీడీపీ కార్యకర్తలకు సమస్య వస్తే మంత్రి నారా లోకేష్ త్వరగా స్పందించి వీలైనంత త్వరగా ఆ సమస్యను పరిష్కరిస్తున్నారని చెబుతునారు చెన్ను.



# ఆ భూముల ధరలు రూ.కోట్లల్లో..

## అయినా రైతన్న చూపు అటువైపే..

హైదరాబాద్: హైదరాబాద్ సమీపంలోని కుంట్లూరులో కోట్ల రూపాయల విలువైన భూములు ఉన్నప్పటికీ.. అక్కడి రైతులు వాటిని అమ్ముకోవడానికి ఆసక్తి చూపడం లేదు. వారసత్వంగా వచ్చిన భూమిని వదులుకోలేక, వ్యవసాయంపై మక్కువతో వరి సాగు చేస్తున్నారు. డబ్బు కళ్ల ముందు కనబడుతున్నా భూమిని అమ్మకుండా.. దానినే నమ్ముకున్న ఆ రైతులను అందరూ ప్రశంసిస్తున్నారు. కోట్లల్లో భూముల ధరలు పరుగెడుతున్నా.. పొట్ట నింపుకోవడానికి వ్యవసాయం చేసేందుకు నడిచి వెళ్తున్న ఆ రైతులకు హ్యాట్సాప్ చెప్పాల్సిందే. తెలంగాణ నేల ఇప్పుడు బంగారు పంట పండిస్తోంది. ఒకప్పుడు కష్టాల కడలిలో ఓలలాడిన రైతు నేడు తన భూమి విలువ చూసి సంబరపడుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకప్పుడు లక్షల్లో పలికిన ఎకరం నేడు కోట్లలో మాట్లాడుతోంది. హైదరాబాద్ మహానగరంలో కోకాపేట, గచ్చిబౌలి వంటి ప్రాంతాల సంగతి చెప్పనక్కర్లేదు.. అక్కడ ఎకరం భూమి ఏకంగా 90 కోట్ల రూపాయలకు పైగా పలుకుతోంది. ఇక నగర శివారుల్లో సైతం రూ.50 కోట్లకు తక్కువ లేదు.

ఇంతటి విలువైన భూముల్లో చాలా వరకు రైతులు వ్యవసాయం చేస్తూ ఉండటం నిజంగా విశేషం. కళ్ళెదుటే కోట్ల రూపాయలు కనబడుతున్నా.. తమ భూమిని అమ్ముకోవడానికి చాలా మంది రైతులు వెనుకాడుతున్నారు. తమ పంటకు సరైన మద్దతు ధర రాకపోయినా, పెట్టుబడి కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నా, కనీస అవసరాలు తీరని దుస్థితి ఎదురైనా.. తమ భూమిని మాత్రం వదులుకోవడానికి సిద్ధంగా లేరు. తరతరాలుగా వస్తున్న ఆ భూమి వారి గుండెల్లో ఒక జ్ఞాపకం, ఒక అనుబంధం. డబ్బుకు ఆ బంధాన్ని తెంచుకోవడానికి వారు ఎంత మాత్రం సిద్ధంగా లేరు.

**వారసత్వంగా వచ్చిన ఆ భూమిని..**

హైదరాబాద్ నగరానికి సమీపంలోని హయత్ నగర్ దగ్గర కుంట్లూరు ప్రాంతంలో అయితే ఈ దృశ్యం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. రహదారి పక్కనే ఉన్న భూములకు కోట్లలో ధర పలుకుతున్నా, అక్కడి రైతులు మాత్రం తమ పొలాలను అమ్ముకోవడానికి ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. వారసత్వంగా వచ్చిన ఆ భూమిని వదులుకోలేక.. వ్యవసాయంపై ఉన్న మక్కువతో నేటికీ వరి పంటను సాగు చేస్తూ ఆ నేలను పచ్చదనంతో నింపుతున్నారు.

కొంతమంది రైతులు తమ పొలాలను అమ్ముకున్నారు. అక్కడ ఇప్పుడు పెద్ద పెద్ద భవంతులు వెలిశాయి. ఒకవైపు సిమెంటు జంగిల్, మరోవైపు పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి.. డబ్బు కళ్ల ముందు కనబడుతున్నా.. తమ భూమిని అమ్ముకోకుండా వ్యవసాయాన్ని నమ్ముకున్న ఆ రైతుల గురించి తెలుసుకున్న వారంతా వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.

భూమి మీద ప్రేమంటే ఇదేనేమో..

'వాహ్! వీళ్ళే నిజమైన రైతన్నలు. భూమి మీద ప్రేమంటే ఇదే' అంటూ వారిని కొనియాడుతున్నారు. నిజంగా.. ఆ రైతులు తీసుకున్న నిర్ణయం వెలకట్టలేనిది. డబ్బుతో కొనలేని అనుబంధాన్ని వారు నిలుపుకున్నారు. భూమిపై బంగారం పండకపోయినా.. నోటికి చేరే ముద్ద కోసం చేసే వ్యవసాయమే బంగారు పంటగా భావిస్తున్న ఆ రైతన్నలకు హ్యాట్సాప్ చెప్పాల్సిందే.

# మహిళా రైతుల కోసం ఈ-ట్రాక్టర్.. మార్కెట్లోకి వచ్చేసింది..

హైదరాబాద్: సీఎంఈఆర్ఐ సంస్థ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో మహిళా రైతులు సులభంగా నడిపేలా ఒక ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను అభివృద్ధి చేసింది. 'సీఎస్ఐఆర్ ప్రైమా ఈటీ 11-కుశాల్' పేరుతో మార్కెట్లోకి రానున్న ఈ ట్రాక్టర్ కాలుష్యాన్ని తగ్గిస్తుంది. రైతులకు నిర్వహణ ఖర్చులను తగ్గిస్తుంది. ఇది ఒక్కసారి ఛార్జ్ చేస్తే నాలుగున్నర గంటల పాటు దున్నుతుంది. రహదారిపై ఆరు గంటల వరకు నడుస్తుంది. ఈ సాంకేతికతను హైదరాబాద్‌కు చెందిన కె.ఎస్.బయోసైన్సెస్‌కు బదిలీ చేశారు. త్వరలోనే ఇది రైతులకు అందుబాటులోకి రానుంది.

కాలుష్యం కోరల్లో చిక్కుకున్న మన భూమికి, శిలాజ ఇంధనాల కొరతతో సతమతమవుతున్న వ్యవసాయ రంగానికి ఇది ఒక గొప్ప ఊపిరిలాంటిది. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కి చెందిన సెంట్రల్ మెకానికల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎంఈఆర్ఐ) పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఈ ఎలక్ట్రిక్ ట్రాక్టర్ నిజంగా ఒక గేమ్-ఛేంజర్. దీనికి 'సీఎస్ఐఆర్ ప్రైమా ఈటీ 11-కుశాల్' అని పేరు పెట్టారు.



'కుశాల్' అంటే నైపుణ్యం కలిగినది అని అర్థం. ఈ ట్రాక్టర్ వ్యవసాయ రంగంలో నిజంగానే ఒక నైపుణ్యమైన సాధనంగా మారనుంది. ముఖ్యంగా మహిళా రైతులు సులభంగా నడిపేలా దీనిని రూపొందించడం ఈ ఆవిష్కరణలోని మరో విశేషం. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనది. వారికి ట్రాక్టర్ నడపడంలో ఉండే ఇబ్బందులను గుర్తించి.. చీరకట్టులో కూడా సులభంగా ఎక్కేలా ట్రాక్టర్ ఎత్తును సర్దుబాటు చేయడం, సీటింగ్ సౌకర్యాన్ని మార్చడం, లివర్లు, స్విచ్‌లను అందుబాటులో ఉంచడం వంటి మార్పులు నిజంగా అభినందించదగినవి. ఇది మహిళా రైతుల సాధికారతకు ఒక గొప్ప ప్రోత్సాహాన్నిస్తుంది.

మన దేశంలో ప్రస్తుతం ఉపయోగిస్తున్న ట్రాక్టర్లన్నీ డీజిల్‌తో నడిచేవే. దేశవ్యాప్తంగా డీజిల్ వినియోగంలో 7 శాతం వాటా ఒక్క ట్రాక్టర్లదే అంటే, అవి ఎంత పెద్ద మొత్తంలో కాలుష్య ఉద్గారాలను విడుదల చేస్తున్నాయో ఊహించవచ్చు. ఈ నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సీఎంఈఆర్ఐ ఈ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను అభివృద్ధి చేయడం నిజంగా ఒక సమయోచితమైన చర్య. ఇందులో 90 శాతం స్వదేశీ పరికరాలను ఉపయోగించారు.ఈ ట్రాక్టర్ సాంకేతిక లక్షణాలు కూడా ఎంతో ఆశ్చర్యకరంగా ఉన్నాయి. 26 హెచ్‌పీ సామర్థ్యంతో.. తక్కువ బరువుతో రూపొందించిన ఈ ట్రాక్టం లోని లిథియం అయాన్ బ్యాటరీని ఒక్కసారి ఛార్జ్ చేస్తే నాలుగున్నర గంటల పాటు పొలాన్ని దున్నవచ్చు. రహదారిపై ఉపయోగిస్తే ఆరు గంటల వరకు నడుస్తుంది. 1.5 నుంచి 1.8 టన్నుల బరువును లాగుతూ 25 కిలోమీటర్ల వేగంతో వెళ్లగలగడం నిజంగా అద్భుతం. ఈ సాంకేతికతను హైదరాబాద్‌కు చెందిన కె.ఎస్.బయోసైన్సెస్‌కు బదిలీ చేయడం ద్వారా ఇది త్వరలోనే మన రైతులందరికీ అందుబాటులోకి రానుంది.

# ఒక స్త్రీ తనకోసం నిలబడే ప్రతీసారి..



తెలంగాణ: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఏఐ ఫోటోను రీట్వీట్ చేసిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, పోలీసుల నోటీసులకు ఏమాత్రం బెదరకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ట్వీట్లను వరుసగా రీట్వీట్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె తన ట్వీట్‌ను తొలగించకపోగా, ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా రీట్వీట్లు చేస్తూ తగ్గేదేలే అన్న సంకేతాన్ని ఇస్తున్నారు. ఈ వ్యవహారం ఐఏఎస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

తెలంగాణలో సర్వత్రా వివాదాస్పదమైన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఏఐ ఫోటోను రీట్వీట్ చేసిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కు తెలంగాణ పోలీసుల నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. పోలీసుల నోటీసులకు స్మితా సబర్వాల్ ఏ మాత్రం వెరవడం లేదు. పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తనదైన శైలిలో.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ట్వీట్లను వరుసగా రీట్వీట్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదానికి సంబంధించి పలువురు రాజకీయ నేతలు, ఇతర వ్యక్తులు సోషల్ మీడియాలో చేసిన పోస్టులను డిలీట్ చేస్తున్నప్పటికీ, స్మితా సబర్వాల్ మాత్రం తన ట్వీట్‌ను తొలగించకపోగా.. ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా రీట్వీట్లు చేస్తూ.. తగ్గేదేలే అన్న సంకేతాన్ని ఇస్తున్నారు.

తాజాగా.. "ఒక స్త్రీ తనకోసం నిలబడే ప్రతిసారీ, ఆమె అందరు మహిళల కోసం నిలబడుతుంది.." అంటూ మాయా ఏంజెలో చెప్పిన సందేశాన్ని పోస్ట్ చేస్తూ ఓ మహిళా నెటిజన్ చేసిన ట్వీట్‌ని ఆమె రీట్వీట్ చేశారు. గతంలోనూ.. తాను చేసిన కొన్ని కామెంట్లు, పోస్టులు పెద్ద దుమారమే రేపినా.. ఏమాత్రం వెరవకుండా చివరివరకు తన మాట మీద నిలబడుతూ.. ఎదురైన ప్రతి సందర్భాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు. కాగా.. ఇప్పుడు కంచ గచ్చిబౌలి భూముల విషయంలోనూ స్మితా సబర్వాల్ అదే ఆత్మస్థైర్యాన్ని కనబరుస్తున్నారు.

కాగా.. కంచె గచ్చిబౌలి వివాదంలో ఏఐ ఫొటోను షేర్ చేసినందుకు గానూ పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేయగా.. అదే సందర్భంగా పలు ట్వీట్లను రీపోస్ట్ చేస్తూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నం చేశారు. వాటిలో ముఖ్యంగా వంద ఎకరాల భూమిని పునరుద్ధరించాలంటూ సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు సంబంధించిన ఒక ఫొటో ఉంది. ఈ ఫొటోను రీట్వీట్ చేయడం ద్వారా ఆమె ప్రభుత్వం ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదని పరోక్షంగా విమర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, మరొక పోస్ట్‌లో "తెలంగాణ పోలీసులు సొంత ఐఏఎస్ అధికారికే నోటీసులు ఇస్తారా? ఇది దేనికి సంకేతం?" అంటూ ఇద్దరు మహిళలు పెట్టిన ట్వీట్‌ను స్మితా సబర్వాల్ రీపోస్ట్ చేశారు. ఈ రీట్వీట్ పోలీసుల చర్యను ప్రశ్నించే విధంగా ఉంది.

ఇదిలా ఉండగా.. ఏఐతో రూపొందించిన బుల్డోజర్లు, నెమళ్లు, జింకలు ఉన్న రెండు పోస్టులను స్మితా సబర్వాల్ గతంలో రీపోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. ఈ పోస్టులకు వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, ఆమె ప్రభుత్వ వ్యతిరేక ట్వీట్లను రీట్వీట్ చేయడం కొనసాగించడంపై ఐఏఎస్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిణి ప్రభుత్వంతో బహిరంగంగా విభేదించడం, పోలీసుల నోటీసులను సైతం లెక్కచేయకుండా వ్యవహరించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. స్మితా సబర్వాల్ తదుపరి చర్యలు ఎలా ఉండబోతాయో వేచి చూడాల్సి ఉంది.

# గోల్కొండ కోటలోకి ఉచిత ప్రవేశం..



హైదరాబాద్: ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలోకి ఉచిత ప్రవేశం కల్పించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 18న ఈ అవకాశం ఉంటుంది. సాధారణంగా టికెట్ ధరలు భిన్నంగా ఉంటాయి. గోల్కొండ కోట తెలంగాణ పర్యాటకానికి ఒక ముఖ్యమైన ఆకర్షణ. తెలంగాణ ప్రభుత్వం తన చారిత్రక సంపదను పరిరక్షించడానికి, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి వివిధ చర్యలు తీసుకుంటోంది.వరల్డ్ హెరిటేజ్ డే.. అంటే ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 18న జరుపుకుంటారు. యునెస్కో ఈ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా సాంస్కృతిక, వారసత్వ సంపదను పరిరక్షించాలనే అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసింది. ఈ రోజున.. వివిధ దేశాలు తమ యొక్క చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక ప్రదేశాల ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. వాటిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబు తాయి. అనేక ప్రదేశాల్లో ఉచిత ప్రవేశాలు, ప్రత్యేక కార్యక్రమాలు.. అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు. తెలంగాణ ప్రభుత్వం కూడా తన చారిత్రక సంపదను పరిరక్షించడానికి.. ప్రోత్సహించడానికి అనేక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని ముఖ్యమైన కట్టడాలైన చార్మినార్, గోల్కొండ కోట, వరంగల్ కోట.. ఇతర చారిత్రక ప్రదేశాల అభివృద్ధి.. సంరక్షణ కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. పర్యాటక శాఖ ద్వారా ఈ ప్రదేశాల ప్రాముఖ్యతను పర్యాటకులకు తెలియజేయడానికి ప్రత్యేక గైడ్‌లు, సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా.. ఈ ప్రదేశాల వద్ద పర్యాటక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా.. ప్రతి సంవత్సరం మాదిరిగానే.. ఏ సంవత్సరం కూడా గోల్కొండ ఫోర్ట్‌లోకి ఫ్రీ ఎంట్రీ ఉంటుందని సీనియర్ పరిరక్షణ అధికారి మల్లేశం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని చారిత్రక కట్టడాలకు ఈ వెసులుబాటు కల్పించారు. పర్యాటకులు, నగర వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గోల్కొండ కోట అధికారులు సూచిస్తున్నారు.

సాధారణంగా గోల్కొండ కోట సందర్శనకు టికెట్ ధరలు పెద్దలకు రూ. 25 (భారతీయులకు).. విదేశీయులకు రూ. 300 వరకు ఉంటాయి. పిల్లలకు, విద్యార్థులకు రాయితీ ధరలు కూడా అందుబాటులో ఉంటాయి. తెలంగాణలో పర్యాటకానికి గోల్కొండ కోట ఎంతో ముఖ్యమైనది. ఇది కేవలం ఒక చారిత్రక కట్టడం మాత్రమే కాదు, తెలంగాణ గొప్ప చరిత్ర, సంస్కృతికి ఇది ఒక సజీవ సాక్ష్యం.

# రాష్ట్ర ప్రజలకు బిగ్ అలర్ట్.. 16 జిల్లాల్లో వర్షాలే వర్షాలు..

హైదరాబాద్: హైదరాబాద్ వాతావరణ శాఖ తెలంగాణలోని 16 జిల్లాలకు వర్ష సూచన జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు.. వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం కూడా ఉందని తెలిపింది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా రైతులు తమ ధాన్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. నేడు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో పాటు, వడగళ్ల వాన కూడా పడే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా వర్షం కురుస్తున్న సమయంలో ఎత్తైన ప్రదేశాలు, చెట్ల కింద ఉండరాదని సూచించారు.

ఈ రోజు వర్ష సూచన ఉన్న జిల్లాలు కొమరంభీం, మంచిర్యాల, జగిత్యాలపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట మరియు నాగర్‌కర్నూల్. ఈ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

వర్షాకాలం ప్రారంభం కాకముందే ఎండాలకాలంలోనే ఇలాంటి వాతావరణ మార్పులు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీనికి తోడు అకాల వర్షాలు, వడగళ్ల వానలు ప్రజలకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు ఈ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. పంటలు చేతికి వచ్చే సమయంలో వడగళ్ల వాన పడితే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.



వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. సంబంధిత జిల్లాల అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. అవసరమైతే సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని సూచించింది. ప్రజలు కూడా తమతమ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు , వృద్ధులు ఇలాంటి వాతావరణ మార్పుల వల్ల త్వరగా ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఈదురుగాలులు వీచే సమయంలో విద్యుత్ స్తంభాలు.. ఇతర ప్రమాదకరమైన వస్తువుల దగ్గరకు వెళ్లకూడదు. వర్షం పడుతున్నప్పుడు వాహనాలు నడిపే వారు కూడా జాగ్రత్తగా ఉండాలి. రహదారిపై నీరు నిలిచిపోయి ఉండటం వల్ల వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉంది. కాబట్టి.. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ మరోసారి విజ్ఞప్తి చేస్తోంది.

# ఆ సీన్ చూశాకే నా ఆరోగ్య సమస్య గురించి తెలుసుకున్నా..

'శంకర్ దాదా ఎం.బి.బి.ఎస్' సినిమాలో డయాబెటీస్ లక్షణాలు విన్న ఒక యువతి, తనకు కూడా అలాంటి లక్షణాలు ఉండటంతో పరీక్ష చేయించుకుంది. ఆమెకు డయాబెటీస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. సరైన చికిత్సతో ఆమె కోలుకుంది. ఈ అసాధారణ సంఘటనను ఆమె సోషల్ మీడియాలో పంచుకుంది. ఒక సినిమా చూసి తన వ్యాధిని గుర్తించిన ఆమె కథ వైరల్ అయింది. ఆమెది మెడికల్ బ్యాక్ గ్రౌండ్ కావడం విశేషం. పూర్తి వివరాలిలా ఉన్నాయి.

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'శంకర్ దాదా ఎం.బి.బి.ఎస్' సినిమా చాలా మందికి గుర్తుండే ఉంటుంది. ఆ సినిమాలో హీరో శంకర్ (చిరంజీవి) తండ్రికి తన కొడుకుని డాక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. కానీ ఇంట్లో నుంచి వెళ్లిపోయిన శంకర్ మాత్రం ఒక గూండాగా ఎదుగుతాడు. చాలా కాలం తర్వాత తండ్రికి దగ్గరైన శంకర్.. తాను దాదా అనే విషయాన్ని దాచిపెట్టి.. డాక్టర్‌నయ్యాని చెబుతాడు. తండ్రిని నమ్మించడం కోసం తన గ్యాంగ్‌తో కలిసి ఒక నకిలీ ఆసుపత్రిని కూడా నడుపుతాడు.

అయితే కొన్ని పరిస్థితుల కారణంగా.. శంకర్ దాదా నిజంగానే ఎం.బి.బి.ఎస్. చదవాలని నిర్ణయించుకుని మెడికల్ కాలేజీలో చేరతాడు. అక్కడ తన జీవితంలో నేర్చుకున్న మానవతా విలువలను, ప్రేమను చూపిస్తూ అందరి మనసులు గెలుచుకుంటాడు. ఒక సందర్భంలో.. కాలేజీ డీన్ శంకర్ దాదాకు ఒక ఇంటర్వ్యూ ఏర్పాటు చేస్తాడు. ఆ ఇంటర్వ్యూలో ఒక డాక్టర్ డయాబెటీస్ (మధుమేహం) లక్షణాలను అడుగుతాడు. అప్పుడు శంకర్ దాదా ఆ లక్షణాలను వివరిస్తాడు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే.. సరిగ్గా ఆ సినిమాలో చూపించిన డయాబెటీస్ లక్షణాలను చూసిన ఒక యువతి, తను కూడా అవే లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించింది. వెంటనే ఒక ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకుంది. ఆ పరీక్షల ఫలితాల్లో ఆమెకు నిజంగానే టైప్ 1 డయాబెటీస్ ఉన్నట్లు తేలింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె మొదట ఆశ్చర్యపోయింది. వెంటనే సరైన చికిత్స తీసుకోవడం వల్ల ఆమె ఇప్పుడు పూర్తిగా కోలుకుంది.

**టైప్ 1, టైప్ 2 డయాబెటీస్‌కి మధ్య తేడాలేంటి?**

ఈ ఆశ్చర్యకరమైన విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా తెలియజేసింది. ఆమె తన పోస్ట్‌లో రాస్తూ.. తనకు టైప్ 1 డయాబెటీస్ ఉందని ఏ డాక్టరో, ఏ క్లినిక్‌లోనో గుర్తించలేకపోయానని.. కేవలం ఒక తెలుగు సినిమా చూసిన తర్వాతే తనకు ఆ వ్యాధి ఉందని తెలిసిందని ఒక వీడియోను కూడా పోస్ట్ చేసింది. ఆమె జోక్ చేయడం లేదని.. ఇది నిజంగా జరిగిందని ఆమె చెప్పింది. సరైన చికిత్స తీసుకున్న తర్వాత తాను పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నానని కూడా ఆమె తెలిపింది. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఆమెది మెడిసిన్ బ్యాక్‌గ్రౌండ్.

'EpicCommentsTelugu%' అనే ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఈ వీడియోను ఒకరు షేర్ చేస్తూ.. తాను దీనిని అస్సలు నమ్మలేకపోతున్నానని.. ఇది చూసిన తర్వాత తన కళ్లను తాను నమ్మలేకపోతున్నానని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌పై నెటిజన్లు తమ ఆశ్చర్యాన్ని.. వివిధ రకాల కామెంట్లను వ్యక్తం చేస్తున్నారు. 'చిరంజీవి సినిమాలు అంటే అలానే ఉంటాయి, సమాజానికి ఉపయోగపడే విషయాలు కూడా ఉంటాయి' అని ఒకరు కామెంట్ చేస్తే.. 'మీరు త్వరగా కోలుకున్నందుకు సంతోషంగా ఉంది' అని మరొకరు కామెంట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక సినిమా ఒక వ్యక్తి జీవితాన్ని మార్చగలగడం నిజంగా అద్భుతమైన విషయం కదా..

### 35 ఏళ్లుగా ఆ రైతు చేస్తున్న కృషి అద్భుతం..

# ఎందరికో ఆదర్శంగా..

ఎండాకాలంలో పశువుల దాహార్తిని తీర్చడానికి సంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు సూరరాజ్ సింగ్ గత 35 సంవత్సరాలుగా నిస్వార్థంగా కృషి చేస్తున్నారు. తనకున్న కొద్దిపాటి నీటిని కూడా పశువుల కోసం వెచ్చిస్తూ, బాటసారులకు కూడా సహాయం అందిస్తున్నారు. ఆయన చేస్తున్న ఈ మానవతా దృక్పథం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. పపశువుల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమను తన చర్యల ద్వారా చాటుకుంటున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.

భూమి తల్లి నెర్రెలు బారుతున్న ఈ భగభగ మండే ఎండలో.. నీటి కోసం అల్లాడిపోతున్న పరిస్థితి. కాస్త దూరం నడిస్తే చాలు.. గొంతు ఎండిపోతుంది. అలాంటి సమయంలో మూగజీవాలైన పశువుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఊహించగలమా..? అవి తమ బాధను ఎవరికీ చెప్పుకోలేవు, నీటి కోసం ఎక్కడికి వెళ్లగలవు..? సరిగ్గా ఈ సమయంలోనే.. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల కేంద్రానికి చెందిన సూరరాజ్ సింగ్ అనే రైతు ఒక నిజమైన మానవతావాదిగా నిలిచారు. పశువుల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమను తన చర్యల ద్వారా చాటుకుంటున్నారు.

సూరరాజ్ సింగ్ గత 35 సంవత్సరాలుగా మూగజీవాల దాహార్తిని తీరుస్తూ వస్తున్నారు. ఝరాసంగం, బొప్పన్‌పల్లి, నర్సాపూర్, సంఘం (కె) గ్రామాల్లోని పశువుల కోసం ఆయన నిరంతరం తపిస్తున్నారు. నేటి ఆధునిక యుగంలో చాలామంది రైతులు బిందు సేద్యం వంటి పద్ధతులను అవలంబిస్తున్నప్పటికీ.. సూరరాజ్ సింగ్ తనకున్న కొద్దిపాటి నీటిని కూడా నోరులేని జీవాల కోసం వెచ్చిస్తున్నారు. ఆయన పొలంలో ఐదు బోర్లు వేయగా.. దురదృష్టవశాత్తూ నాలుగు పూర్తిగా ఎండిపోయాయి. ఇక మిగిలిన ఒక్క బోరులో వచ్చే నీటిని పశువుల దాహం తీర్చడానికి ఉపయోగిస్తున్నారు. అంతేకాదు.. ఆ కొద్ది నీటితోనే ఉల్లిగడ్డలు, పశువుల మేతను సాగు చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

**ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సింది ఇదే..**


ఆయన చేస్తున్న ఈ గొప్ప పని కేవలం పశువులకే పరిమితం కాలేదు. అటుగా వెళ్లే వాహనదారులు, పొలాల్లో పనిచేసే కూలీలు, బాటసారులు కూడా ఆయన ఏర్పాటు చేసిన నీటి సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఎవరికీ నీటి సమస్య రాకుండా తన వంతు సహాయం అందిస్తూ.. సూరరాజ్ సింగ్ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. నిజంగా.. ఆయన చేస్తున్న పని ఒక గొప్ప యజ్ఞం. నోరులేని జీవాల పట్ల ఇంతటి కరుణ, ప్రేమ చూపడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన విషయం.

**నిస్వార్థంగా మూగజీవుల కోసం..**

సూరరాజ్ సింగ్ లాంటి వ్యక్తులు సమాజానికి ఒక వెలుగు దివ్వెలాంటి వారు. స్వార్థంతో నిండిన ఈ రోజుల్లో.. నిస్వార్థంగా మూగజీవుల కోసం పాటుపడుతున్న ఆయన నిజంగా అభినందనీయుడు. ఆయన చేస్తున్న పనిని కేవలం ఒక సహాయంగా చూడలేము.. అది ఆయన హృదయంలోని మానవత్వానికి ప్రతిరూపం. పశువుల పట్ల ఆయన చూపిస్తున్న ప్రేమ, వాటి దాహాన్ని తీర్చడానికి ఆయన పడుతున్న తపన ఎంతో గొప్పది. ఆయన చేస్తున్న ఈ పని ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సూరరాజ్ సింగ్ ఇతరులకు ఎంతో స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.



ఊర్వశీ రౌతేలా వ్యాఖ్యలపై టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఆమె మాటలను సరిగ్గా అర్థం చేసుకోవాలని కోరింది.



# ‘స్పిరిట్’ పూర్తి చేశాకే?

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న రెండు సినిమాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఒకటి ‘ది రాజాసాబ్’ కాగా, మరొకటి హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా. మరో సినిమా ‘స్పిరిట్’తోపాటు, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కూడా ప్రారంభానికి సిద్ధం అవుతున్నాయి. ఆయా సినిమాల చిత్రీకరణలు, నిర్మాణానంతర పనుల్లో ఆలస్యం కారణంగా... కథానాయకులు, దర్శకుల ప్రాధాన్యాలు మారుతుంటాయి. ఈ క్రమంలో అనూహ్యంగా కొత్త ప్రాజెక్టులు తెరపైకొస్తుంటాయి. అలా టాలీవుడ్‌లో ప్రస్తుతం పలు కలయికలు ప్రచారంలో ఉన్నాయి. ‘స్పిరిట్’ ఆలస్యం అవుతుండడంతో కథానాయకుడు ప్రభాస్‌కి సంబంధించి, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా చేయనున్న సినిమాల గురించి పలు ఊహాగానాలు ప్రచారంలోకి వస్తున్నాయి. ‘స్పిరిట్’ స్థానంలో వీళ్లిద్దరూ వేరే ప్రాజెక్టుల్ని పట్టాలెక్కిస్తారనేది వాటి సారాంశం. అయితే ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా ఇద్దరూ కూడా ‘స్పిరిట్’ పూర్తి చేశాకే ఇతర ప్రాజెక్టులపైన దృష్టిపెట్టనున్నట్టు తెలిసింది. ఇటీవలే ఈ సినిమా కోసం లొకేషన్ల ఎంపికపై కసరత్తులు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనుందని తెలిసింది. ఇందులో ప్రభాస్ పోలీస్ అధికారిగా నటించనున్నారు.

# ‘డాన్ 3’లో శార్వరీ

మరి కొద్దిరోజుల్లో ‘ఆల్ఫా’ సినిమాతో తనలోని యాక్షన్ కోణాన్ని సినీ ప్రియులకు పరిచయం చేయనున్న కథానాయిక శార్వరీ వాఘ్. ఇప్పుడామె మరో భారీ ప్రాజెక్టులో భాగమైనట్లు తెలుస్తోంది. బాలీవుడ్ కథానాయకుడు  రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘డాన్ 3’. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఫర్హాన్ అక్తర్ రూపొందిస్తున్నారు. రితేశ్ సిధ్వానీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయిక శార్వరీ వాఘ్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం. గతంలో విడుదలై విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న ‘డాన్’ ఫ్రాంచైజీలో భాగంగా రూపొందుతున్న చిత్రమిది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ ఏడాదిలోనే చిత్రీకరణను ప్రారంభించుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఫర్హాన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.






# ఎన్ని నిందలు వేసినా ఏమీ అనుకోను

ఏఆర్ రెహమాన్‌ను ఉద్దేశించి ప్రముఖ గాయకుడు అభిజీత్ ఇటీవల విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీనిని ఉద్దేశించి రెహమాన్ తాజాగా స్పందించారు. ఎన్ని విషయాల్లో తనని తప్పుపట్టినా తాను ఏమీ అనుకోనని అన్నారు. ప్రతిఒక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుందని.. దానిని తప్పుపట్టాల్సిన అవసరం లేదని వెల్లడించారు. “అన్ని విషయాలకు నన్ను తప్పుపట్టడం బాగానే ఉంది. అభిజీత్ నాపై ఎలాంటి విమర్శలు చేసినా నేను ఆయన్ని గౌరవిస్తూనే ఉంటా. ఆయన అంటే నాకెంతో అభిమానం. ప్రేమతో ఆయనకు స్వీట్స్ పంపుతా. నా వర్క్‌పై ఆయనకు ఉన్న అభిప్రాయాన్ని ఆవిధంగా బయటపెట్టారు. దానిని నేను ఏమాత్రం తప్పుపట్టను. ఎందుకంటే ప్రతి విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉంటుంది” అని రెహమాన్ అన్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అభిజీత్ సంగీత రంగంలో వస్తోన్న మార్పులపై స్పందించారు. ఇందులోభాగంగా ఆయన ఏఆర్ రెహమాన్ గురించి మాట్లాడారు. రెహమాన్ ఎక్కువగా టెక్నాలజీపై ఆధారపడుతున్నారని విమర్శించారు. గాయనీగాయకులకు బదులు.. టెక్నాలజీని ఉపయోగించి ఆయన మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారన్నారు. దానివల్ల ఎంతోమందికి ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు. ఈ వ్యాఖ్యల పైనా రెహమాన్ మాట్లాడారు. ఇప్పటికే తాను ఒక మహిళా ఆర్కెస్ట్రా బృందాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. “దుబాయ్ వేదికగా ఇటీవల ఒక మహిళా ఆర్కెస్ట్రా బృందాన్ని సిద్ధం చేశా. అందులో సుమారు 60 మంది మహిళలు ఉన్నారు. వారికి ఉద్యోగాలు ఇచ్చి ప్రతి నెలా జీతం ఇస్తున్నా. వాళ్ల కోసం ఆరోగ్య, జీవిత బీమా కడుతున్నా. అంతేకాకుండా ‘పొన్నియిన్ సెల్వన్’, ‘ఛావా’ వంటి చిత్రాల కోసం వర్క్ చేసినప్పుడు సుమారు 200 మంది సంగీతకారులను అందులో భాగం చేశా. కొన్నిసార్లు కేవలం పాటల కోసమే 100 మందికి పైగా వర్క్ చేస్తుంటారు. ఆ విషయాలను నేను ఎక్కడా బయటపెట్టను. అలాగే దానికి సంబంధించిన ఫొటోలనూ పంచుకోను. కాబట్టి ఎవరికీ నా వర్కింగ్ స్టైల్ గురించి పెద్దగా అవగాహన ఉండదు” అని ఆయన వివరణ ఇచ్చారు.

# పవన్ కుమారుడిని కాపాడిన భారత కార్మికులకు.. సింగపూర్ ప్రభుత్వం అవార్డు



ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్ స్కూల్లో ఏప్రిల్ 8న జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఈ ప్రమాదం నుంచి మార్క్ సహా కొంతమంది చిన్నారులను నలుగురు భారతీయ వలస కార్మికులు కాపాడారు. ఇటీవల సింగపూర్ ప్రభుత్వం వారిని సత్కరించింది. తాజాగా వారికి ‘లైఫ్ సేవర్’ అవార్డును ప్రదానం చేసింది. వారి ప్రాణాలు పణంగాపెట్టి పిల్లలను రక్షించినందుకు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు సింగపూర్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్ పేర్కొంది.

ఈ ప్రమాదంపై కార్మికులు మాట్లాడుతూ.. “మేము చూసేసరికి గదిలో పిల్లలు భయంతో వణుకుతూ, అరుస్తూ కనిపించారు. మూడో అంతస్తు నుంచి కొందరు పిల్లలు దూకేయాలని చూశారు. మేం వాళ్లతో మాట్లాడి దూకకుండా చూశాం. తర్వాత వారిని కిందకు తీసుకొచ్చాం. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఆమెను కాపాడలేకపోయినందుకు ఇప్పటికీ బాధపడుతున్నాం” అని

# ‘45’ చిత్రీకరణలో ఉన్నప్పుడే నాకు క్యాన్సర్ అని తెలిసింది!

## ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్‌కుమార్



కథే ఈ సినిమాకి హీరో అని చెప్పారు ప్రముఖ కన్నడ నటుడు శివ రాజ్ కుమార్. కన్నడ అగ్ర నటులు ఉపేంద్ర, రాజ్.బి శెట్టితో కలిసి ఆయన నటించిన చిత్రమే ‘45’. ప్రముఖ సంగీత దర్శకుడు అర్జున్ జన్యా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఉమా రమేశ్ రెడ్డి, ఎం.రమేశ్ రెడ్డి నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల హైదరాబాద్‌లో టీజర్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివరాజ్ కుమార్ మాట్లాడుతూ “నాలుగు నుంచి ఐదు నిమిషాలు ఈ కథని వినిపించారు అర్జున్ జన్యా. అందుకే ఈ సినిమాకి ‘45’ అని పేరు పెట్టుకున్నాం. ఉపేంద్రతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా చిత్రీకరణలో ఉన్నప్పుడే నాకు క్యాన్సర్ అని తెలిసింది. కీమోథెరపి తీసుకుంటూనే చిత్రీకరణలో పాల్గొన్నాను” అన్నారు. ఉపేంద్ర మాట్లాడుతూ “శివరాజ్ కుమార్‌తో ఈ సినిమాలో నటించడం సంతోషంగా ఉంది” అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ “ఒక్క సన్నివేశం కూడా వృథా కాకుండా, ప్రీ విజువలైజేషన్‌తో ముందే సినిమాని చూసుకుని ఆ తర్వాత చిత్రీకరణ చేశాం” అన్నారు. సనాతన ధర్మం ప్రస్తావన ఈ సినిమాకి కీలకం అని చెప్పారు చిత్ర నిర్మాత.



# మండు వేసవిలో చల్ల గాలిలా...

## సారంగపాణి జాతకం

తెలుగు నటులున్న అచ్చ తెలుగు సినిమానే మా ‘సారంగపాణి జాతకం’ అన్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. క్రైమ్ అంశంతో కామెడీ సినిమాని తెరకెక్కించామని చెప్పారు. ఆయన దర్శకత్వంలో... ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా రూపొందిన చిత్రమిది. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కథానాయకుడు ప్రియదర్శి మాట్లాడుతూ “మండు వేసవిలో చల్లటి గాలి వీస్తే ఎంత ప్రశాంతంగా, మనసుకు ఎంత ఆనందంగా ఉంటుందో ఈ సినిమా అలాంటి అనుభూతిని పంచుతుంది” అన్నారు.

# దిల్ రాజు ఏఐ కంపెనీ




ఎంటర్టైన్ మెంట్ రంగం ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. దశాబ్దానికో కొత్త ట్రెండ్ వస్తోంది. అలా ఇప్పుడు ఏఐ హవా కొనసాగుతోంది. భవిష్యత్తులో మార్కెట్ ని శాసించేది అంతా ఇదేనని అంతా ఫిక్స్ అయ్యారు కూడా. ఇప్పటికే పలు బడా సంస్థలు దీనిమీద కోట్లు వెచ్చిస్తున్నాయి. తాజాగా స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు కూడా ఏఐ పవర్ మీడియా కంపెనీని అనౌన్స్ చేశాడు. అంతేకాక ప్రముఖ కంపెనీతో భారీ ఒప్పందం కూడా కుదుర్చుకున్నాడు .

మారుతున్న టెక్నాలజీని సినీరంగంలో కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

ఈ విషయాన్ని తెలియజేస్తు దిల్ రాజు కంపెనీ వదిలిని వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టాలీవుడ్ సినిమాల్లో ఏఐ టెక్నాలజీకి సంబంధించిన పనులు చేసే ‘క్వాంటమ్ AI గ్లోబల్’తో కలిసి.. తన కొత్త A% స్టూడియోను ప్రారంభించబోతున్నట్లు వీడియో ద్వారా తెలియచేశాడు. సినిమా ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన మార్పులను ఈ చిన్నవీడియోలో చూపించారు. ఇప్పుడు ఏఐ అన్నిరంగాలను శాసిస్తుండటంతో... దిల్ రాజు ఈ కంపెనీని ఏర్పాటు చేస్తున్నాడట. దీని పూర్తి వివరాలు మే 4న ప్రకటిస్తారట. కామన్ గా దిల్ రాజు ఏడాదికి కనీసం ఆరేడు సినిమాలు తీయగల సత్తా ఉన్న నిర్మాత. సో తన సొంత సినిమాలన్నింటిలో ఇప్పుడు ఏఐ టెక్నాలజీతో ఉపయోగించే ఛాన్స్ కనిపిస్తోంది. డబ్బింగ్ నుంచి విజువల్ ఎఫెక్స్ వరకూ ఎలాంటి వర్క్ నైనా ఏఐతో చేసుకునే అవకాశం ఉంది. అందుకే టాలీవుడ్ కు ఇది కచ్చితంగా ఉపయోగపడుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు రాజు. ప్రస్తుతం దిల్ రాజు ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్?గా ఉన్నారు. మరోవైపు భారీ బడ్జెట్ సినిమాలు నిర్మిస్తూ, పంపిణీ చేస్తు బిజీగా ఉన్న ఆయన కొత్త కంపెనీకి శ్రీకారం చుట్టడం ఆయన ముందు చూపును తెలియచేస్తోంది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist.  Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,